
కల్యాణ వేదికపై రఘునాయకునికి హారతి ఇస్తున్న పూజారి

రమణీయం..

రఘునాయకుని కల్యాణం

నాగులుప్పలపాడు మండలం చదలవాడలోని శ్రీరఘునాయక స్వామి కల్యాణం సోమవారం కన్నులపండువలా జరిగింది. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి పరిణయాన్ని తిలకించి పులకించిపోయారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కల్యాణం ప్రారంభమైన గంట తర్వాత గరుడ పక్షి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వెళ్లిపోయింది. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా రామనామస్మరణతో మార్మోగింది. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు.


ఆలయం చుట్టూ గరుడ పక్షి ప్రదర్శన

7


గరుడ పక్షిని చూసి భక్తుల తన్మయత్వం



6

అంగరంగ వైభవం

రాచర్ల మండలంలోని శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం స్వామి వారి తెప్పోత్సవాన్ని వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల మధ్య నిర్వహించారు. రాత్రికి రథోత్సవం రమణీయంగా సాగింది.


ఒంగోలులో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, కలెక్టర్

అంబేడ్కర్‌కు ఘన నివాళి

- ఊరూరా జయంతి వేడుకలు.. సభలు, సమావేశాలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఒంగోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకవైపు ప్రభుత్వ యంత్రాంగం ద్వారా, మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, ఉద్యోగ, దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కడికక్కడ ముఖ్యప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ బాటలో ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నదని అధికార పక్ష ప్రజాప్రతినిధులు వివరించారు. జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల, ప్రకాశం భవన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహించారు. ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, కలెక్టర్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా విగ్రహాలకు నివాళులర్పించారు. అలాగే సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, లింగంగుంటల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన టంగుటూరుతోపాటు తూర్పునాయుడుపాలెం, వల్లూరులలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ హాజరయ్యారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి, మిగతా 6లో...

హైస్కూల్ ప్లస్ అట్టర్ ఫ్లాప్!

ఇంటర్ ఫలితాల్లో డీలా

- ఐదు పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత
- వైసీపీ పాలనలో హడావుడిగా ప్రారంభం
- వనరుల గురించి పట్టించుకోని వైనం
- ఈ ప్రభుత్వంలోనూ కనిపించని మార్పు

జిల్లాలోని హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇంటర్ ఉత్తీర్ణతలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. ఇతర యాజమాన్యాల్లోని విద్యాసంస్థలతో పోల్చితే అట్టడుగున నిలిచారు. రాష్ట్రస్థాయిలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులు సగటున 34శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 10.55శాతం తక్కువగా కేవలం 23.45 శాతం మంది మాత్రమే పాసయ్యారు. సీనియర్ ఇంటర్‌లో రాష్ట్ర ఉత్తీర్ణత 60శాతం ఉండగా.. జిల్లాలో 5.08శాతం తగ్గి 54.92శాతం మాత్రమే సాధించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి వనరులు కల్పించకుండానే హైస్కూల్ ప్లస్‌లను హడావుడిగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దగా దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు ఫలితాల సాధనలో డీలా పడ్డారు.



ఒంగోలు విద్య, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులు సాధించిన ఫలితాలు తీవ్ర నిరాశపర్చాయి. 13 హైస్కూల్ ప్లస్‌లలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఐదు పాఠశాలలు జీరో ఉత్తీర్ణత సాధించాయి. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 226 మంది హాజరు కాగా కేవలం 53 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఝైనంపాడు హైస్కూల్ ప్లస్ నుంచి 9 మంది, హెచ్.నిడమానూరు నుంచి 13 మంది, గిద్దలూరు నుంచి ఏడుగురు, కొణిజేడు నుంచి 10 మంది, కురిచేడు నుంచి 11 మంది పరీక్షలు రాయగా ఒక్కరు కూడా పాస్ కాలేదు. పాకలలో 8 మందికి ఐదుగురు, కరవదిలో 21 మందికి నలుగురు, కె.ఉప్పలపాడు నుంచి 10 మందికి 8, దేవరపాలెంలో 19 మందికి నలుగురు ఉత్తీర్ణులయ్యారు. శీలంవారిపల్లిలో 28 మందికి 16, బేస్తవారపేటలో 17 మందికి నలుగురు, ముండ్లమూరులో 31 మందికి 10, కొత్తపట్నంలో 42 మందికి కేవలం ఇద్దరు మాత్రమే పాసయ్యారు. బాలికల డ్రాపౌట్స్‌ను తగ్గించాలన్న ఉద్దేశంతో గత వైసీపీ హయాంలో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. కానీ అవసరమైన వనరులను కల్పించలేదు. మొదటి నుంచి విద్యార్థులకు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. చదువుకొనేందుకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోవడం పెద్ద మైనస్ అయ్యాయి. హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాలల్లో మిగతా 6లో...

పోరాటయోధుడా.. వందనం

- ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను త్యజించిన అమరజీవి
- రేపు పొట్టి శ్రీరాములు జయంతి

7





మాస్టారు..

మా మనసులు గెలిచారు!

7

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ టీచర్ల క్యాంపెయిన్

- అద్దంకి పట్టణం, మండలంలో పలు పాఠశాలల పరిధిలో అవగాహన
- స్కూళ్లల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం.... పెరుగుతున్న అడ్మిషన్లు
- ముందస్తు చర్యలతో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు



గ్రామ, వార్డు సచివాలయాల

ప్రక్షాళన

- జనాభా ప్రాతిపదికన మూడు కేటగిరీలు
- ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉద్యోగుల హేతుబద్ధీకరణ
- ప్రారంభమైన కసరత్తు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ఉపక్రమించింది. అందుకు అవసరమైన చర్యలను చేపట్టింది. అందులో భాగంగా జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించింది. 2,500లోపు జనాభా ఉన్న వాటిని కేటగిరీ-ఏ కింద, 2,501 నుంచి 3,500 మంది జనాభా ఉన్న వాటిని కేటగిరి-బీ కింద, 3,501 మందికి పైబడి ఉంటే కేటగిరీ-సీ కింద చేర్చింది. ఏ కేటగిరీలో ఏయే ఉద్యోగులు ఎంత మంది ఉండాలన్న దానిపై స్పష్టతనిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల హేతుబద్ధీకరణపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.

జిల్లాలో సచివాలయాల రేషనలైజేషన్ ఇలా...

గ్రేడ్	జనాభా	సచివాలయాలు	ఉద్యోగులు
ఏ-గ్రేడ్	0-2500	201	1,752
బీ-గ్రేడ్	2,501-3,500	219	1,930
సీ-గ్రేడ్	3,501మందిపైన	299	2,802
మొత్తం	--------	719	6,484

సీ-కేటగిరీలో 299 సచివాలయాలు

జిల్లాలో 719 గ్రామ సచివాలయాలు ఉండగా మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ-ఏలో 201, కేటగిరీ-బీలో 219, కేటగిరీ-సీలో 299 సచివాలయాలను చేర్చారు. వాటిలో 6,484 మంది ఉద్యోగులు పనిచేయనున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో ప్రస్తుతం సగటున 8 నుంచి 11 మంది వరకూ విధులు నిర్వర్తిస్తున్నారు. విభజన ప్రకారం ఆ సచివాలయానికి ఎంత మంది అవసరమవుతారో అంత మందిని కొనసాగించి మిగిలిన ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నారు. కేటగిరీ-ఏ సచివాలయాల్లో మల్టీపర్పస్ సిబ్బంది ఇద్దరు, టెక్నికల్ సిబ్బంది నలుగురు కలిపి ఆరుగురిని నియమించనున్నారు. కేటగిరీ-బీ సచివాలయాల్లో మల్టీపర్పస్ సిబ్బంది ముగ్గురు, టెక్నికల్ సిబ్బంది నలుగురితో కలిసి ఏడుగురు, కేటగిరీ-సీ సచివాలయాల్లో నలుగురు మల్టీ పర్పస్ సిబ్బంది, నలుగురు టెక్నికల్ మిగతా 6లో...

గుంటిగంగ.. దేదీప్యంగా..

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తాళ్లూరు మండలంలోని గుంటిగంగ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. కొందరు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంతం విద్యుత్ కాంతులతో శోభిల్లింది. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆరు కరెంటు ప్రభలను ఏర్పాటు చేశారు. వాటిపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

7



చిత్రజ్యోతి

SINCE 1965

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపీచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నపుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసెనే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

వైభవంగా తెప్పోత్సవం.. ఉత్సాహంగా రథోత్సవం



స్వామిని మోసుకొస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఘనంగా నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం స్వామి తెప్పోత్సవం, దివ్య రథోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. లచ్చమ్మపేట నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఆయన కుటుంబీకులు, టీడీపీ నాయకులు, భక్తులు కావడిపై భుజాల మీద పట్టి నెమలిగుండం వరకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసిన తెప్పలోకి తరలించి కొలనులో విహరింపజేశారు. సాయంత్రం స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తెప్పోత్సవం, రథోత్సవాన్ని తిలకించి 'గోవింద' నామస్మరణ చేశారు. దేవస్థాన ఈవో నాగయ్య, టీడీపీ మండల అధ్యక్షులు యోగానంద్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తేనెటీగల కలకలం

రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మధ్యాహ్నం కొద్దిసేపు తేనెటీగలు కలకలం సృష్టించాయి. లచ్చమ్మపేటకు, దేవస్థానానికి మధ్య అకస్మాత్తుగా తేనెటీగల గుంపు భక్తులపైకి దాడి చేసింది. దీంతో కాలినడకన వెళుతున్న భక్తులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. సుమారు 30 మంది భక్తులకు తేనెటీగలు కుట్టాయి. వెంటనే వైద్యసిబ్బంది వారిని పరీక్షించి తగిన మందులు అందజేశారు. తేనెటీగల గుంపు దాడి నేపథ్యంలో కొద్దిసేపు అటువైపుగా వెళ్లేందుకు భక్తులు జంకారు. తేనెటీగల తీవ్రత తగ్గిన తరువాత భక్తుల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వార్డు, గ్రామ సచివాలయాల ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది కలిసి ఎనిమిది మందిని ఏర్పాటు చేస్తారు. మల్టీ పర్పస్ కింద సాధారణ అవసరాలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 1-5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్, వార్డు సచివాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శి, మహిళా పోలీస్‌ను నియమిస్తారు. ప్రత్యేక/ టెక్నికల్ సిబ్బందికి సంబంధించి గ్రామ సచివాలయాల్లో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీర్ అసిస్టెంట్, అగ్రికల్చర్/హార్టీకల్చర్/సెరికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ/ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్‌ను, వార్డు సచివాలయాల్లో వార్డు రెవెన్యూ కార్యదర్శి, హెల్త్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శి, అమెనిటీస్ కార్యదర్శి, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, ఎనర్జీ కార్యదర్శులను నియమిస్తారు. ఆయా కేటగిరీలకు సంబంధించి సచివాలయాల్లో సిబ్బంది నియామకాలపై జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో ఉద్యోగుల హేతుబద్ధీకరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

మహితాద్భుతం

- పెన్సిళ్ల లిడ్‌పై అంబేడ్కర్ జీవిత చరిత్ర
- ఆయన జయంతి సందర్భంగా ఆర్ట్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొండయ్య



మైక్రో ఆర్ట్ ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న మహిత

చీరాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో మట్టిలో నుంచి మాణిక్యం పుట్టింది. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక వ్యక్తిగత సామర్థ్యం ఉంటుందని, దానిని గుర్తించి ఆచరణలో పెడితే జీవితానికి అర్థం..పరమార్థం ఉంటుందని చీరాలకు చెందిన అన్నం మహిత నిరూపించింది. తండ్రి ఆటో డ్రైవర్ నరసింహారావు, తల్లి భ్రమరాంబకు మహిత గారాల పట్టి. ప్రస్తుతం ఒంగోలులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈమె కొవిడ్ సమయంలో ఖాళీగా ఉంటూ బియ్యం గింజలపై జాతీయ పతాకం గీసింది. దీంతో ప్రముఖుల నుంచి అభినందనలు అందుకుంది. ఆమెలో ఉత్సాహం రెట్టింపయింది. ఈక్రమంలో ఆమెకు తట్టిన కొత్త ఆలోచనతో పెన్సిల్ లిడ్‌పై అద్భుతాలను సృష్టించారు. పెన్సిల్ లిడ్స్‌పై రామాయణం, మహాభారతం, భగవద్గీతతో సహా, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్, విన్సెంట్ ఫెర్రర్ చరిత్రలను లిఖించింది. ఈక్రమంలో అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు, అవార్డులను అందుకుంది. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సుమారు పదిరోజుల పాటు శ్రమించి 50 పెన్సిళ్లతో అంబేడ్కర్ జీవిత చరిత్ర మైక్రో ఆర్ట్‌ను తయారు చేసింది. ఆ ఆర్ట్‌ను సోమవారం ఎమ్మెల్యే కొండయ్య సైతం ప్రదర్శించారు. త్వరలో ఒంగోలులో జరిగే వేడుకల్లో అంబేడ్కర్ మనవడు రాజారతన్ అంబేడ్కర్‌కు ఆర్ట్‌ను బహూకరించనున్నట్లు మహిత తెలిపారు. యువతి నైపుణ్యతను చూసి అందరూ శభాష్ అంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వలన ఒరిగింది ఏమీలేదు!

అవీఇవీ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లు జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే ప్రస్తుతం చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని, ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలు దొందూదొందే అని, రాష్ట్రానికి రాహుకేతువులు లాంటి వారని విమర్శించారు. వైసీపీ రాష్ట్రాన్ని అప్పులు, డ్రగ్స్ ఆంధ్రాగా తయారు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మద్య ఆంధ్రాగా తయారుచేస్తోందని చెప్పారు. ప్రతి మండలంలో నాలుగు మద్యం షాపులు, 40 బెల్టు షాపులు ఉన్నాయన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు లాంటి హామీలు విస్మరించారని విమర్శించారు. మాజీ శాసనసభ్యులు ఎస్‌కె.మస్తాన్‌వలి మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు ముస్లిం సంపదను దోచుకునే దురుద్దేశంతో బీజేపీ ప్రభుత్వం కుట్ర చేసిందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, నాయకులు బీఆర్ గౌష్, మన్నం ప్రసన్నరాజు, పాలపర్తి విజేష్‌రాజ్, బొడ్డు సతీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

(5వ పేజీ తరువాయి)

పామూరు పట్టణాలలో జరిగిన కార్యక్రమాల్లోనూ, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరులో, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లోనూ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు యర్రగొండపాలెంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ నియోజకవర్గ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొని రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు. జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాలు, వందలాది గ్రామాల్లో రాత్రి వరకు అంబేడ్కర్ జయంతి వేడుకలు పెద్దఎత్తున నిర్వహించారు. వివిధ రాకీయ పార్టీలు తమ కార్యాలయాల వద్ద కార్యక్రమాలను నిర్వహించి అంబేడ్కర్‌ను స్మరించుకున్నాయి.

హైస్కూల్ ప్లస్.. అట్టర్ ఫ్లాప్!

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇచ్చి ఆర్థిక సౌలభ్యం కలిగించగా కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో అది లేదు. దీంతో అసలు డిప్యూటేషన్‌పై ఈ పాఠశాలల్లో చేరేందుకు టీచర్లు సుముఖత వ్యక్తం చేయలేదు. ఆ ప్రభావం గత విద్యా సంవత్సరం ఫలితాల్లోనే కన్పించింది. ఇప్పుడు ప్రభుత్వం మారినా ఎలాంటి మార్పు కన్పించ లేదు.

సీనియర్ ఇంటర్‌లోనూ తగ్గిన ఉత్తీర్ణత

హైస్కూల్ ప్లస్ సీనియర్ ఇంటర్ విద్యార్థులు కూడా తక్కువ ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో సగటున 60శాతం మంది పాస్ కాగా జిల్లాలో 5.08శాతం తక్కువతో 54.92శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలకు 122 మంది హాజరు కాగా 67 మంది మాత్రమే పాసయ్యారు. పాకల, కె.ఉప్పలపాడుల నుంచి గరిష్ఠంగా 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కొణిజేడు నుంచి కేవలం 12.5శాతం మంది మాత్రమే పాసయ్యారు. పాకల నుంచి 10 మంది హాజరు కాగా 9 మంది, మైనంపాడు నుంచి 9 మందికి ఐదుగురు, కరవదిలో 14 మందికి 9 మంది, హెచ్.నిడమానూరులో 7మందికి ముగ్గురు, కె.ఉప్పలపాడులో 8 మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. గిద్దలూరు హైస్కూల్ ప్లస్ నుంచి 16 మంది పరీక్షలు రాయగా ఐదుగురు, దేవరపాలెంలో 8 మందికి నలుగురు, కొణిజేడులో 16 మందికి ఇద్దరు, శీలంవారిపల్లిలో 34 మందికి 23మంది పాసయ్యారు. మొత్తం మీద హైస్కూల్ ప్లస్‌ల విద్యార్థులు ఫలితాల సాధనలో వెనుకబడిపోయారు.


ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ

అమ్మా.. గంగమ్మా..!

వైభవంగా గుంటిగంగ తిరునాళ్ల

● అమ్మవారికి ప్రత్యేక పూజలు ● సామాజిక వర్గాల వారీ పలు సత్రాలలో అన్నదానం

తాళ్లూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటిగంగ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన గదులు సరిపోక ఆలయం వెనక భాగంలో, చెట్లకింద పొంగళ్లు పెట్టుకుంటూ ఎండవేడిమికి కొంత ఇబ్బందులు పడ్డారు. గంగమ్మకు పశుజాతిని బలి ఇచ్చి సకాలంలో వర్షాలు కురిపించి కాపాడు అంటూ వేడుకున్నారు. భక్తులు పశుసంపదను, వాహనాలను తీసుకొచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల వద్ద వేలాది మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ లక్ష్మి

ప్రత్యేక పూజలు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, మన్నేపల్లి సమర, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, వైసీపీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, గుజ్జుల యోగిరెడ్డి పాల్గొన్నారు.

6 ప్రభల ఏర్పాటు

తిరునాళ్ల సందర్భంగా టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఆరు విద్యుత్ ప్రభలు ఏర్పాటయ్యాయి.

భక్తుల పాట్లు

దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సీఐ వై.రామారావు నేతృత్వంలో ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు, పోలీసులు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విధుల నిర్వహణ సక్రమంగా లేకపోవటం వల్ల ఉదయం వేళనే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆలయం వద్ద నియమించిన పోలీసులు కన్పించకపోవటం, స్థానికులం, ముఖ్యులమంటూ వెలుపలికి వెళ్లే మార్గం గుండా అధికసంఖ్యలో భక్తులను ఆలయంలోకి అనుమతించటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయంలోనుంచి బయటకురాలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నా పోలీసులు, దేవదాయ అధికారులు మిన్నకుండిపోయారు. క్యూలో గంటలకొద్దీ భక్తులు నిల్చొని ఇబ్బందులు పడ్డారు. వీరికి మంచినీరు అందక దాహార్తితో తల్లడిల్లారు. దొంగలపై, అనుమానితులపై దృష్టిసారించి ముందస్తుగా అదుపులోని తీసుకున్నారు. తిరునాళ్లలకు వచ్చిన భక్తులకు తేజా వృద్ధాశ్రమం వారు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.


గంగమ్మదర్శనానికి బారులుదీరిన భక్తులు



పడమటిపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం

పోరాటయోధుడా.. వందనం

ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు త్యజించిన అమరజీవి

రేపు పొట్టి శ్రీరాములు జయంతి

పీసీపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాడు తెలుగుప్రజలు తమిళ భాషా పాలనలో తీవ్ర ఇబ్బందులతో పాటు ఎన్నో అవమానాలను ఎదుర్కొనేవారు. ఏ పని కావాలన్నా అప్పటి రాజధాని మద్రాసుకు వెళ్లి రావడం తెలుగు ప్రజలకు వ్యయప్రయాసలతో కూడుకోవడంతో అల్లాడిపోయేవారు. ఢిల్లీలోని నాటి కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు కూడా తెలుగువారి కష్టాలను పట్టించుకునేవారు కాదు. అటువంటి పరిస్థితుల్లో ఒకేఒక్కడు తెలుగుతేజం.. ఢిల్లీలోని కేంద్ర పీఠాన్ని కదిలించాడు.. ఆయనే మనం అమరజీవిగా పిలుచుకుంటున్న పొట్టి శ్రీరాములు.

తమిళనాడు నుంచి ఆంధ్రాను విడగొట్టి తెలుగువారి కోసం ఒక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ 58రోజుల పాటు ఆమరణ దీక్ష చేపట్టి ఆత్మబలిదానం చేసుకున్నాడు. ఆయన ఆత్మబలిదానంతో ఆంధ్రరాష్ట్రం సిద్ధించింది. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రకాశం జిల్లాలోని పీసీపల్లి మండలం పడమటిపల్లిలో జన్మించాడు. ఆయన 125వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వేడుకలను నిర్వహిస్తుంది.

పడమటిపల్లిలో ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన ఆయన ఆంధ్రరాష్ట్రం కోసం అశువులు బాసి దేశవ్యాప్తంగా తెలుగువారికి కీర్తిని సంపాదించారు. నెల్లూరు జిల్లాలో ఆయన ఎక్కువ కాలం ఉండడం, ప్రకాశం జిల్లా ఏర్పడక ముందు పడమటిపల్లి గ్రామం నెల్లూరు జిల్లాలో ఉండడంతో పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు చెందినవారుగా రికార్డుకెక్కారు. పొట్టి శ్రీరాములు సొంత గ్రామం పడమటిపల్లిలో 2013లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అప్పటి తమిళనాడు గవర్నర్ రోశయ్యను తీసుకొచ్చి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాలేరునదిపై పాలేటిపల్లి వద్ద నిర్మించిన పాలేటిపల్లి రిజర్వాయర్‌కు పొట్టి శ్రీరాములు రిజర్వాయర్‌గా 2013లో డాక్టర్ ఉగ్ర నామకరణం చేశారు.


పొట్టి శ్రీరాములు నివాసస్థలం

భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటులో మార్గదర్శి

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటులో ఆయన వేసిన బాట ఎన్నటికీ మర్చిపోలేనిది. అప్పటి నెల్లూరు, ప్రస్తుతం ప్రకాశం జిల్లాలోని పీసీపల్లి మండలం పడమటిపల్లి అనే మారుమూల గ్రామంలో పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించారు. 20ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఆయన విద్యాభ్యాసం మద్రాసులోనే సాగింది. తరువాత బొంబాయిలో శానిటరీ ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసి రైల్వేశాఖలో ఉద్యోగిగా చేరారు. అక్కడ నాలుగేళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఈక్రమంలో జాతిపిత గాంధీజీ బాటలో నడిచిన ఆయన 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. కొంతకాలం జైలుశిక్ష అనుభవించారు. 1941-42 క్విట్ ఇండియా ఉద్యమం వరకు అనేక ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. ఈక్రమంలో భాషా ప్రాతిపదికన తెలుగువారికోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ 1952 అక్టోబరు 19న మద్రాసులో నిరాహారదీక్ష ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు ప్రారంభించిన దీక్ష క్రమేణ ప్రజల్లో అలజడి రేపింది. రోజులు గడిచేకొద్దీ ప్రజలు శ్రీరాములుకు మద్దతుగా సమ్మెలు, ప్రదర్శనలు జరిపారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుదిశగా విస్పష్ట ప్రకటన చేయలేదు. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తున్నా పొట్టి శ్రీరాములు మాత్రం దీక్షను విరమించలేదు. 1952 డిసెంబరు 15న ఆరోగ్యం విషమించి పొట్టి శ్రీరాములు బలిదానం అయ్యారు. దీంతో కేంద్రం దిగివచ్చి తెలుగు వారికోసం ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.


అద్దంకిలోని పాత ఊర రోడ్డులో భవనాసి కాలువ వద్ద దుస్తులు ఉతుకుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సత్రం బడి ఉపాధ్యాయులు

మాస్టారు.. మా మనసులు గెలిచారు...!

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ టీచర్ల క్యాంపెయిన్

అద్దంకి పట్టణం, మండలంలోని పలు పాఠశాలల పరిధిలో అవగాహన

స్కూళ్లల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం

పెరుగుతున్న అడ్మిషన్లు

ముందస్తు చర్యలతో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాలకు వస్తే పాఠాలు చెప్పడం గతం మాట.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు మారటం... అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పంథా మార్చుకుంటున్నారు. తమ పరిధిలో ఉన్న విద్యార్థులు తమ పాఠశాలలోనే చేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కదిలారు. గతంలో స్కూళ్లు పునఃప్రారంభించే సమయంలో అక్కడక్కడా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొద్దోగొప్పో క్యాంపెయిన్లు నిర్వహించే వారు. అప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు, వాటిల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏదో ఒక విధంగా విద్యార్థులకు గాలం వేసి తమతమ స్కూళ్లల్లోనే చేర్పించుకునే వారు. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటికేడు పడిపోతోంది.

లోకేష్ సంస్కరణలు.. ఉపాధ్యాయుల క్యాంపెయిన్లు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటికేడు పడిపోతుండడంతో విద్యా శాఖ మంత్రి లోకేష్ పలు సంస్కరణల అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఇటీవల పలు సందర్భాలలో ప్రకటించారు. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో ఉపాధ్యాయులు కార్యోన్ముకులు అయ్యారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు స్కూళ్ల బలోపేతంపై దృష్టి సారించారు. ఒక అడుగు ముందుకేసి ముందస్తుగానే క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో మీ బిడ్డలను చేర్పించాలని, అక్కడ ఉన్న వసతులు, సౌకర్యాలు, ప్రభుత్వం నుంచి కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లితండ్రులకు వివరిస్తున్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా బోధన, మోడల్ స్కూల్‌లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని కూడా వివరిస్తున్నారు. వీరి క్షేత్ర స్థాయి పర్యటనలతో తల్లిదండ్రులలో నమ్మకం మరింత పెరిగి అడ్మిషన్లు కూడా ఆశించిన దానికంటే ఎక్కువగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పాఠశాలల ఉపాధ్యాయుల క్యాంపెయిన్లకు మంచి స్పందన వస్తుండటంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సరికొత్త తాయిలాలకు దిగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎంత వరకు ఫలిస్తుందో వేచి చూడాల్సి ఉంది.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో 2 సుధాకరరావు


ఎన్‌టీఆర్ నగర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

షైనింగ్ స్టార్స్ అవార్డుకు చాతుర్య ఎంపిక

నేడు మంత్రి లోకేష్ చేతుల మీదుగా ప్రదానం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చదువులో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న షైనింగ్ స్టార్-25 అవార్డుకు కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య ఎంపికయ్యారు. మార్చిలో జరిగిన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఏపీ మోడల్ స్కూళ్లు, హైస్కూలు ప్లస్ జూనియర్ కళాశాలలు, కేజీబీవీల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఈ ఏడాది షైనింగ్ స్టార్ అవార్డును ప్రవేశపెట్టింది. ఈ అవార్డు కింద విద్యార్థులకు ప్రశంసాపత్రం, పతకం, ల్యాప్‌టాప్, ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందిస్తుంది. రాష్ట్రంలోని మొత్తం 52 మంది విద్యార్థులు ఈఅవార్డుకు ఎంపిక చేయగా జిల్లా నుంచి చాతుర్య ఒక్కరే ఎంపికయ్యారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీలో 1000కి 980 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు చాతుర్యను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డుకు ఎంపికైన చాతుర్యను ఆర్ఐవో సైమన్‌విక్టర్ అభినందించారు. మంత్రి నారా లోకేష్ నివాసంలో మంగళవారం ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు.


చాతుర్య

కనులపండువగా రఘునాయక కల్యాణం

గరుడ పక్షి రాకతో తన్మయత్వం చెందిన భక్తులు

వైభవంగా రథోత్సవం

పాల్గొన్న ఎంఎల్ఏ బీఎన్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన చదలవాడలోని శ్రీరఘునాయక స్వామి 240వ వార్షిక కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. అలంకరించిన స్వామివార్లను పల్లకిలో దేవస్థానం వద్దనున్న కల్యాణ వేదికపైకి తీసుకొచ్చి ఈవో దొంత అనీల్ కుమార్, ప్రధాన అర్చకులు దేవేంద్ర ఆధ్వర్యంలో యాజ్ఞిక స్వామి వెంకటాచార్యులు బృందం వేదమంత్రాల నడుమ అశేష భక్తజనం సాక్షిగా ఉదయం 10 గంటలకు కల్యాణ క్రతువును ప్రారంభించారు. పొన్నూరి వెంకటశ్రీనివాసులు కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మద్దిరాలపాడుకు చెందిన ఉభయదాతలు పెనుబోతు వంశీయులు స్వామికి నూతన పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. 11 గంటల సమయంలో ఆకాశంలో గరుడ పక్షి కల్యాణ వేదిక చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో భక్తులు తన్మయత్వం చెందారు. రామ నామ స్మరణం జపించారు. అనంతరం స్వామికి కల్యాణ తలంబ్రాలు పోసి ఆ ఘట్టాన్ని పూర్తిచేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు స్వామి కల్యాణతలంబ్రాలను ప్రత్యేక కౌంటర్ ద్వారా అందజేశారు. అన్నదానం చేశారు.


రఘునాయకస్వామి

రథోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఏ బీఎన్

రఘునాయక స్వామి కల్యాణోత్సవంలో భాగంగా సాయంత్రం స్వామి రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఎంఎల్ఏ బీఎన్ విజయ్‌కుమార్ రఘునాయక స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదాతలు తూమాటి రాంబోట్లు చౌదరి దంపతులతో కలసి రథంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు యువకులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎంపీపీ అప్పల కుమార స్వామి, ఎంపీటీసీ సభ్యుడు పమిడి ముక్కల శివకృష్ణ, కొంజేటి ధనుష్, ఆలయ ధర్మకర్త ఉప్పల లక్ష్మీనరసింహాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు చదలవాడ వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.


వైభవంగా రథోత్సవం


స్వామికి మొక్కుతున్న బాలుడు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు 21వరకు పొడిగింపు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 11, 12 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. అనాథలు, బడిబయటి పిల్లలు, మధ్యలో చదువు మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని వివరించారు.

అవీ..ఇవీ

బకింగ్‌హామ్ కెనాల్‌పై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

● హోం మంత్రి అమిత్‌షాను కోరిన ఎంపీ మాగుంట


కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను సత్కరిస్తున్న మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం గుండాపాలెంలో బకింగ్ హామ్ కెనాల్‌పై రూ.17 కోట్లతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. డిల్లీలో సోమవారం ఆశాఖ మంత్రి అమిత్‌షాను ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అమిత్‌షాను సత్కరించారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను వినతిపత్రం రూపంలో సమర్పించారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని పశ్చిమ ప్రాంతం బాగా వెనుకబడి ఉందని, అందువల్ల ప్రత్యేకదృష్టిసారించి నిధులు కేటాయించాలని మాగుంట కోరారు.


విజేతలకు బహుమతి చెక్కును అందజేస్తున్న న్యాయాధికారి అమ్మన రాజా

ముగిసిన క్రికెట్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని భీమ్ సేవా సమితి, భీమ్ ప్రగతి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. స్థానిక మంగమూరు రోడ్ మర్రిచెట్టు సమీపంలోని మైదానంలో వారం రోజులపాటు జరిగిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాజట్లు పాల్గొని హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో వెంగముక్కలపాలెంకు చెందిన అంబేడ్కర్ లెవెన్స్ మొదటి స్థానంలో నిలిచి రూ.30వేల నగదు, షీల్డు, కప్ అందుకోగా, మద్దిపాడు మణి, లెవెన్స్ జట్టు ద్వితీయ, తృతీయ స్థానంలో విజయం సాధించింది. ఈ మేరకు రెండవ బహుమతి రూ. 20వేలు, మూడవ బహుమతి రూ. 10వేలు అందజేశారు. జిల్లా అడిషనల్ న్యాయాధికారి డి. అమ్మన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం. ఆదినారాయణ, పిల్లి శ్రీరాములు, కృపారావు, కట్ట ప్రవీణ్, అంగలకుర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఆధునీకరించిన భోజనశాలను ప్రారంభిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

రెడ్డి హాస్టల్‌కు సౌకర్యాలు కల్పిస్తాం

● దర్శి శాసనసభ్యుడు బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రెడ్డి హాస్టల్ భవనంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని దర్శిశాసనసభ్యుడు డాక్టర్‌బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక మామిడిపాలెంలోని రెడ్డిహాస్టల్‌లో బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆధునీకరించిన భోజనశాలను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు మంచాలను అందించారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రెడ్డి హాస్టల్‌ను సందర్శించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండవ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు

ముగిసిన క్రీడాపోటీలు

● పాల్గొన్న 400 మంది క్రీడాకారులు
● విజేతలకు బహుమతుల ప్రదానం

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడాపోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక డీఆర్ఆర్ఎం స్కూలులో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, విలువిద్య, పలు పోటీలలో సుమారు 400 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి వ్యాపారవేత్త, టీడీపీ నాయకులు మండవ మురళీకృష్ణ, టుటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, నిర్వాహకులు చిక్కాల కిరణ్‌కుమార్, ఎంఈవో నాగేంద్ర వదన్, అసిస్టెంట్ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాతరావు, సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్, ఏజే సొల్యూషన్ డైరెక్టర్ ప్రియ, పలువురు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


రొయ్య సాగు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్)ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): రొయ్యలు సాగు చేసే రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని, యూనిట్ విద్యుత్ రూపాయన్నరకు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం త్రోవగుంట కంపెనీల వద్ద గల బృందావన్ కల్యాణ మండపంలో సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య సాగు రైతుల నూతన కమిటీ ఏర్పాటుకు,సమస్యలపై చర్చకు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు మాట్లాడుతూ రొయ్య విత్తనం (సీడ్) మంచి నాణ్యతది సరఫరాలేక పోవటంతో పంట దిగుబడి సక్రమంగా రావటంలేదన్నారు. అడ్డగోలు విద్యుత్ బిల్లులు రావడంతో అవి కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ యూనిట్ ఒకటిన్నర రూపాయికి ఇవ్వాలన్నారు. అడిగిన ప్రతిరైతుకు కొర్రీలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుతో పాటు తక్షణమే అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని రొయ్యల సాగు రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదర యస్వంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కిలారి రవికుమార్, కోశాధికారిగా ఏడుగుండ్ల కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడిగా చెరుకూరి లక్ష్మీనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి చేపల వేట బంద్

● జూన్ 14 వరకు నిషేధం



ఒంగోలు నగరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం విధించింది. ఈ నిషేధం జూన్ 14 వరకు అమల్లో ఉంటుంది. ఈ మేరకు 61రోజుల పాటు ప్రభుత్వం వేటను నిషేధిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. మోటార్‌తో నడిచే బోట్లు, పడవలు, మెకనైజ్డ్ బోట్ల ద్వారా వేట సాగించే వారికి ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ సీజన్‌లో సముద్ర జీవులు గుడ్లు పెట్టే సమయం కావటంతో ఆ గుడ్లను ధ్వంసం చేసే అత్యాధునిక వలలతో వేట సాగించే యంత్రాలతో నడిచే పడవలు, బోట్లు, పెద్ద పెద్ద ట్రాలీలపై నిషేధం విధించింది. నిషేధాన్ని వ్యతిరేకించి వేట సాగించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. ఏప్రిల్ 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు సముద్రంలోని తల్లి చేపలు ఎక్కువగా గుడ్లు పెట్టేసమయం. ఈ సమయంలో ఇబ్బడి ముబ్బడిగా వేట సాగిస్తే వాటి ఉనికికే ప్రమాదం ఉండే అవకాశం ఉంది. దీంతోస ముద్రం సంపదను కాపాడేందుకు ప్రభుత్వం ఈ నిషేధాన్ని అమలు చేస్తోంది. ఏటా ఈ సీజన్‌లో వేటపై నిషేధం విధిస్తున్న ప్రభుత్వం ఈ సమయంలో వేట లేక మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా వారికి తగిన పరిహారం అందిస్తోంది. వేట నిషేధ సమాచారాన్ని లీన్‌సీజన్ అంటారు. ఈ సమయంలో మత్స్యకారులకు ప్రతి ఏటా పరిహారం అందిస్తోంది. చేపల వేటపై ప్రభుత్వం విధించిన నిషేధం సంప్రదాయ మత్స్యకారులకు వర్తించదు. పడవలకు మోటార్లు బిగించకుండా తెడ్డు కర్రలతో వేట సాగించే సంప్రదాయ మత్స్యకారులు మాత్రం వేట చేసుకునేందుకు అనుమతిస్తారు. జిల్లాలో మొత్తం 1,300 బోట్లు ఉన్నాయి. వీటిలో 892 బోట్లు మోటార్‌తో నడిచేవి కాగా మిగిలినవి తెడ్డుకర్రలతో వేటసాగించేవి.

ఘనంగా అంబేడ్కర్ జయంతి


ఒంగోలులో జరిగిన సభలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఒంగోలులో డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, పీవీ శివారెడ్డి, పీవీ కృష్ణారెడి తదితరులు ఉన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్‌రియాజ్, ఆ పార్టీ నాయకుడు కంది రవిశంకర్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శిశాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బీటీఏ ఆధ్వర్యంలో

బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కే దేవసహాయం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బి. నాగేంద్రవదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

టీడీపీ ఆధ్వర్యంలో

ఒంగోలు కార్పొరేషన్ : రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గం నేటి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఒంగోలు నగరంలో

స్థానిక హెచ్‌సీఎం సెంటర్, ప్రకాశం భవనం వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్ర పటానికి కలెక్టర్ అన్సారియా, శాసన సభ్యులు దామచర్ల జనార్దన రావు, బీఎన్ విజయకుమార్, జిల్లా అధికారులు, దళిత సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సభ నిర్వహించారు. అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి, వెలుగు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొత్తపట్నంలో అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు అల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ బీసీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఒంగోలులోని స్థానిక లంబాడీ డొంకలో డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఒంగోలు విద్య : స్థానిక రావు అండ్ నాయుడు క్యాంపస్‌లోని ఆర్‌జేయూకేటీ ట్రిబుల్‌ఐటీలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పటేల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.చంద్రశేఖర్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొండపిలో

కొండపిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సింగరాయకొండలో...

సింగరాయకొండలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జయమణి, సర్కిల్ కార్యాలయంలో సీఐ హజరత్తయ్య నివాళులర్పించారు.

టంగుటూరులో..

టంగుటూరులోని ఒంగోలు-కొండపి రోడ్డు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు రూరల్‌లో

ఒంగోలు(రూరల్) : ఒంగోలు మండలపరిషత్ కార్యాలయంలోను ,కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోను, మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఎస్ఎన్‌పాడులో

సంతనూతలపాడు : మండలంలోని సంతనూతలపాడు ఎస్సీ వసతి గృహంలో, ఎంపీడీవో కార్యాలయంలో , తహసీల్దార్ కార్యాలయంలో, టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటాలకి అధికారులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

మద్దిపాడులో

మద్దిపాడు : మద్దిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మాజీ మేనేజర్ కొచ్చర్ల పోల్ రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు ప్రభాకర్ ఆధ్వర్యంలోనూ, స్థానిక ఎస్సీ హాస్టల్‌లోను నిర్వహించారు.

మరో గ్రంథాలయ ఉద్యమ సన్నాహక సమావేశం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మరో గ్రంథాలయ ఉద్యమ కార్యక్రమాలను మే 1వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించాలని ఉద్యమ ఐక్యవేదిక నాయకులు నిర్ణయించారు. ఇందుకోసం సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు, సామాజిక, సాహిత్యవేత్తలను గ్రంథాలయ ఉద్యమంలోకి ఆహ్వానించడం, యువతను పెడదారుల నుంచి మళ్లించే విధంగా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కథా రచయిత పి.రాజ్యలక్ష్మి, మరో గ్రంథాలయ ఉద్యమ కార్యదర్శి కాంతి నల్లూరి, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, సీఏ ప్రసాద్, డాక్టర్ నూకతోటి రవికుమార్, డాక్టర్ శంకరరావు, సత్యనారాయణ మూర్తి, కవయిత్రి బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పాతికేళ్ల తర్వాత కలుసుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :పెదారవీడు ప్రభుత్వ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం కొత్తపట్నం సముద్రతీరాన ఆనందోత్సాహాల మధ్య సాగింది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం 2001 సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఒకచోట చేరి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి చిన్నారులు.. నేటి పెద్దలు చదువుకున్న రోజుల్లో ఆటపాటలు, అల్లరి చేష్టలు గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలలో మునిగిపోయారు. తరగతి గదిలో ఉపాధ్యాయులతో గడిపిన రోజులను నెమర వేసుకోవడంతో పాటు, ప్రస్తుతం వారి యొక్క కుటుంబ స్థితిగతులు, ఉద్యోగ, వ్యాపారాలు, యోగ క్షేమాలు తెలుసుకుని సంబరపడిపోయారు. ఇకపై ప్రతి ఏటా ఒకచోట కలుసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని వారందరూ నిర్ణయించుకున్నారు. రోజంతా ఆటపాటలతో.. సముద్రతీరాన ఆడి పాడిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

వెబ్‌సైట్‌లో ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖపరిధిలోని ప్రభుత్వ,జిల్లాపరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూలు అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియారిటీ జాబితాలను సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 16లోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో అభ్యంతరంలో స్పష్టంగా పేర్కొనాలని, అందుకు తగిన ఆధారాలతో సంబంధిత అధికారి ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు.

రెండు బైకులు ఢీ

● ఇరువురికి గాయాలు

చీమకుర్తి,ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనంనేనివారిపాలెంకు వెళ్లే రహదారిపై సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. చీమకుర్తి నుంచి కేవీ పాలెం వెళ్తున్న బైక్ ఎదురుగా కేవీ పాలెం నుంచి చీమకుర్తి వైపు వస్తున్న మరో బైక్ ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌లు నడుపుతున్న ఇద్దరు యువకులు కిందపడిపోయారు.గాయాలపాలైనఇద్దరిని ఆటోలో వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.


16వ డివిజన్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

● నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : డివిజన్లలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ పనిచేసి, పార్టీకి పేరు తీసుకురావాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గుంటూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో 10,13,16,18 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజలు వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో, డివిజన్‌లో కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి వలన నేడు గెలుపు సాధించి అధికారంలోకి వచ్చామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతంకంటే రెట్టింపుగా పనిచేసి, ప్రజల సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వేసవి అయినందున డివిజన్లలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్యలు ఉన్నపుడు క్లస్టర్‌ఇన్‌చార్జులతో మాట్లాడి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జులు షేక్ కపిల్ బాషా, బండారు మదన్, ఆయా డివిజన్ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

● కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి

మద్దిపాడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసి రెడ్డి విమర్శించారు. సోమవారం మద్దిపాడులో జొన్నావట్ల శ్రీనివాసరావు గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విధానాలను యువత అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం పాలసీలో ఇష్టం వచ్చిన బ్రాండ్లు ప్రవేశ పెట్టి వైఎస్ జగన్మోహన రెడ్డి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారాన్నారు. మరోపక్క వైసీపీ, టీడీపీ కూటమి దొందూ దొందే అని తులసి రెడ్డి అన్నారు. ప్రస్తుతం మండలానికి నాలుగు మద్యం షాపులు, నలభై బెల్టు షాపులు అన్నట్లుగా పరిస్థితి తయారయ్యిందని ఆయన దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి వంటివి అమలు కావటం లేదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని, వక్ఫ్ బోర్డులో ముస్లింలు కానివారిని నియమించడం అన్యాయమని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, సిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరకపల్లి నాగలక్ష్మి, బీఆర్ గౌస్, పాలపర్తి విజేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్యాడ్లు, పరీక్షల కిట్స్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సంతనూతలపాడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు అంబేడ్కర్‌నగర్‌లో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మార్పుడి పాపారావు తండ్రి కోటయ్య జ్ఞాపకార్థం సోమవారం విద్యార్థులకు ప్యాడ్లు, పరీక్షల కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు, మండల జనసేన అధ్యక్షుడు ఎం.ఫణీంద్ర, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం

సంతనూతలపాడు, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): నేడు మండలంలో పలుగ్రామాల్లో 33 విద్యుత్‌లైన్ కింద విరిగిపడిన చెట్లను తొలగించే క్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ టి.సంతోష్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. పి.గుడిపాడు, కొనగానివారిపాలెం, చంద్రపాలెం గ్రామాల్లో ఉదయం 7 నుంచి 9 గంటలవరకు, ఎండ్లూరు, మైనంపాడు, కుంచాలవారిపాలెం గ్రామాల్లో ఉదయం 7గంటలనుంచి 12 గంటలవరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నిరుపేద ఎస్సీలకు జీవనోపాధి నిమిత్తం ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు సోమవారం ఓప్రకటనలో తెలిపారు. మే 13వరకు అవకాశం ఉందని, దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పంపాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలుక్రైం,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కే.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాన్ని వారం రోజులు పాటు చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అధునాతనమైన పరికరాలతో ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.అగ్నిమాపక శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసుల రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విధినిర్వహణలో అసువులుబాసిన అగ్నిమాపక సిబ్బందికి ఘనంగా నివాళి అర్పించారు.

ఎండుతెగులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి కల్లాల్లో తడిసిన మిరప కాయలకు ఎండుతెగులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ ఏవో ప్రత్యూష సూచించారు. ఒమ్మెవరం, కండ్లగుంట, మాచవరం గ్రామాలలో అకాల వర్షాలకు తడిసిన మిరప కాయలను సోమవారం ఆమె పరిశీలించారు. తడిసిన కాయలు తాలు రాకుండా, ఎండుతెగులు సోకకుండా ఉండేందుకు 30 గ్రాములు బిల్‌టాక్స్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అవి.. ఇవి

బైకు అదుపుతప్పి యువకుడు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి). మండలంలోని రాయవరం ఫ్లైఓవర్ బ్రిడ్జి పై బైకు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై పడటంతో యువకుడు ఈదా కాశి (23) మృతి చెందగా మరొక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఈదా కాశి అతని స్నేహితుడు వేమలకోట గ్రామ పంచాయతీ జంకె రామిరెడ్డి కాలనీ కి గోగు చెన్నకేశవులుతో కలిసి బైక్ పై వ్యక్తి గత పనుల నిమిత్తం జంకె రామిరెడ్డి కాలనీ నుండి రాయవరం వెళుతున్నారు. రాయవరం బిడ్జి పై బైకు అదుపు తప్పడంతో ఫుట్‌పాత్ పైకి బైక్ వేగంగా వెళ్ళిపోయింది. దీంతో బైక్ పై ఉన్న ఇద్దరు క్రింద పడిపోవడంతో ఈదా కాశి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన మరొక యువకుడు గోగు చెన్నకేశవులుకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొదిలిలో పట్టపగలు చోరీ

● 30 తులాల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ


వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

పొదిలి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పొదిలి లో పట్టపగలే ఒక ఇంట్లో చోరి జరిగింది. దొంగతనం జరిగిన ఇంటికి ఓ వైపు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం మరోవైపు కోర్ట్ ప్రాంగణం ఉంది. అయినా రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పగటివేళే దొంగతనం జరగడం గమనార్హం. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం విశ్వనాథపురం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదురుగా ఉన్న బీరం నాసరరెడ్డి ఇంట్లో పట్టపగలు దొంగలుపడ్డారు. సుమారుగా 30తులాల బంగారు నగలు దోచుకెళ్ళినట్ల నాసర్‌రెడ్డి తెలిపారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే నాసరరెడ్డి రోజుమాదిరిగానే పనులకు బైటకు వెళ్లాడు భార్య ఆదిలక్ష్మీ కూలి పనులకోసం వెళ్లింది. ఇంటికి తాళం వేశారు. కాని బైట గేటుకు తాళం వేయకపోవడంతో దొంగలు ప్రధానద్వారం నుంచి ఉన్న డోర్‌కటన్ అడ్డుపెట్టుకొని తాళం పగులగొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. బీరువా పగులగొట్టి లాకర్‌లో ఉన్న బంగారుహారాలు, ఉంగరాలు, చైను, బుట్టకమ్మలు, సుమారు రెండుకిలోల వెండిచెంబు, ప్లేటు, కుందీలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన ఘటనస్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుండి క్లూస్‌టీంను పిలిపించి ఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించారు. నాసర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● రెండు మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటన

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్ల ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా రామాపురంలో కార్పెంట ర్‌గా పనిచేస్తున్న పెద్దముస్తఫా (47) గిద్దలూరుకు ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళుతుండగా, మండలంలోని ముండ్లపాడు గ్రామసమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఎదురెదురుగా వస్తున్న మరో మోటారుబైకు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో పెద్దముస్తఫా అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ద్విచక్రవాహనదారుడికి కూడా గాయాలు కావడంతో ఆయన్ను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది. అయితే ఆయన గురించి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చాతుర్యకు అభినందన


చాతుర్యను అభినందిస్తున్న ఆర్ఐవో సైమన్‌విక్టర్

కంభం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల లో హెచ్‌ఈసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్యను ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రకాశం జిల్లా ఆర్ఐవో, కంభం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్ సోమవారం అభినందించారు. జిల్లాకే ఖ్యాతి తెచ్చే విధంగా ఇష్టపడి చదివి 980 మార్కులు సాధించ డం గర్వకారణమన్నారు. సోమ వారం చాతుర్య ఇంటికి వెళ్లి అభినందించారు. 15వ తేది రాష్ట్ర ప్రభుత్వం అందింజేయనున్న షైనింగ్ స్టార్- 2025 అవార్డుకు సంబంధించిన సమా చారాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. భవిష్యత్తు చదువులకు సంబం ధించిన సలహాలు, సహకారం, తోడ్పాటు కళాశాల నుంచి, అధికారుల నుంచి ఉంటుందన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి

● ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం

పుల్లలచెరువు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశంలో కరువును శాశ్వతంగా పరిష్కరించేందుకు పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు.సోమవారం గంగవరంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని రైతులతో కలిసి సంతకాలు సేకరించారు. పోస్టుకార్డులను రాష్ట్ర సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈ సందర్భంగా పుల్లలచెరువు మండలంలో శాశ్వతంగా కరువు పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు 5 కాలువను పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలని అన్నారు. పుల్లలచెరువు మండలంలో అధికారంలో ఉన్న పార్టీలు పట్టించుకోవడం లేదని సాగు ,తాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ట్యాంకర్లకు పెట్టే ఖర్చుతో తీగలేరును పూర్తి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాధం, వైసీపీ నాయకులు జానకి రఘు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పాతికేళ్ల తర్వాత కలుసుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :పెదారవీడు ప్రభుత్వ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం కొత్తపట్నం సముద్రతీరాన ఆనందోత్సాహల మధ్య సాగింది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం 2001 సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఒకచోట చేరి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి చిన్నారులు.. నేటి పెద్దలు చదువుకున్న రోజుల్లో ఆటపాటలు, అల్లరి చేష్టలు గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలలో మునిగిపోయారు. తరగతి గదిలో ఉపాధ్యాయులతో గడిపిన రోజులను నెమర వేసుకోవడంతోపాటు, ప్రస్తుతం వారి యొక్క కుటుంబ స్థితిగతులు, ఉద్యోగ, వ్యాపారాలు, యోగక్షేమాలు తెలుసుకుని సంబరపడిపోయారు. ఇకపై ప్రతి ఏటా ఒకచోట కలుసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని వారందరూ నిర్ణయించుకున్నారు. రోజంతా ఆటపాటలతో.. సముద్రతీరాన ఆడి పాడిన వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.





అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, కొమరోలులో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ అమూల్య, పొదిలిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, తర్లుపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

దార్శనికుడికి ఘన నివాళి

● వాడవాడలా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు
● నివాళి అర్పించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
● పలుచోట్ల సేవా కార్యక్రమాలు

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించిన దార్శనికుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా పట్టణంలోని అన్నాక్యాంటీన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్ లొక్కు రమేష్, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ పట్టణ అధ్యక్షులు మానం బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఫారెస్టు ఆఫీస్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైస్‌ఎంపీపీ బండారి నోవెల్ పాల్గొన్నారు. బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో ఫారెస్టు ఆఫీసు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

చలివేంద్రం ఏర్పాటు

దివ్యహెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నరవ రోడ్డులో దివ్య ఫ్లెక్సీ ప్రింటింగ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులు లొక్కు శరత్‌బాబు, కామూరి శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల (గిద్దలూరు) : రాచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్, మాజీ వైస్‌ఎంపీపీ జీవనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమరోలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ నాయక్‌లు నివాళి అర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ బ్రహ్మయ్య, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ సభ్యులు సారె వెంకటనాయుడు, వైసీపీ మండల కన్వీనర్ మేరిగ రవికుమార్‌లు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

కొనకనమిట్ల : స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో వాగుమడుగు సర్పంచ్ బూదాల జోసెఫ్ కమలాకర్ అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉన్నగురువాయిపాలెం పశువైద్యాధికారి మణిశేకర్, చినమనగుండం ఎంపీటీసీ సభ్యుడు కోండ్రు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపిపి జెస్సీపా, పిల్లి బాల నర్సయ్య, పిల్లి కొండయ్య, చిన్నా, నాయకులు అంబటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : బోడపాడు ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రాన్ని బోర్డుపై వేసి ఆయన గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు. డ్వాక్రా బజారులో డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. విశ్రాంత తహసీల్దార్ జైపాల్ పాల్గొన్నారు.

తర్లుపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, తర్లుపాడు సచివాలయంలో ఈఓఆర్‌డీ సుకుమార్, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, పలు కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం: పట్టణంలోని ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో నియోజకవర్గ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, అధ్యాపకులను టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.అచ్యుతరావు, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు అధ్యక్షులు పయ్యావుల ప్రసాదు, తెలుగుయువత నాకులు వేగినాటి శ్రీను, పుల్లలచెరువు ఎంపీపీ కందుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : అంబేడ్కర్ జయంతిని మార్కాపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు జంకే వెంకటరెడ్డి, అన్నా రాంబాబులు నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్‌సీబీసీ మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌వీకేపీ రోడ్డులో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జ్ కాశీనాథ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎర్రయ్య, సీపీఐ నాయకులు అందె నారసరయ్య, కాశీం తదితరులు పాల్గొన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ ఆధ్వర్యంలో కోర్టు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ మార్కాపురం అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ సయ్యద్ జావీద్ అన్వర్ నివాళులర్పించారు. వివిధ పాఠశాలలోనూ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

పొదిలి : . మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని నివాళి అర్పించారు. బడుగుబలహీన వర్గాలకోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. అనంతరం బీసి, కమ్మ, రెడ్డి, కాపులకు కేటాయించిన కార్పొరేషన్ రుణాల్లో బీసీలకు 9, కమ్మ 4, రెడ్డిలకు 6, మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో డీటీ షాజీదా, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వేమన అదేవిధంగా స్థానిక ఏబీఎం కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐ వెంకటేశ్వర్లులు అబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

బేస్తవారపేట : బేస్తవారపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుల్ల చిన్నసుబ్బయ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తహసీల్దార్ జీతేంద్ర, ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మిరియాల శేఖర్, దార్ల ప్రేమ్ కుమార్, కువ్వారపు రమేష్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కంభం : కంభం మండలం హజరత్‌గూడెం పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఆకవీటి సరోజ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని చింతలపాలెం రావిపాడు కాలనీలో నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురష్కరించుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర షెడ్యూలు కులాల పరిరక్షణ సమితి అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్, సర్పంచ్ రజని తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం వద్ద వార్డెన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కంభం మండల ప్రత్యేక అధికారి సైమన్‌విక్టర్, ఎంపీడీవో వీరభద్రాచారి, ఎస్సై నరసింహారావు, సర్పంచ్ రజని, తదితరులు పాల్గొన్నారు. అర్థవీడు మండలంలో మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఎస్సై సుదర్శన్, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అబ్రహం, కంభం నవోదయ సెంటర్‌లో బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు దాసరి యోబు ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. జంగంగుంట్ల ఎంఎస్‌పీ నాయకులు ఫ్రాంక్లిన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.





వై.పాలెంలో నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు, మార్కాపురంలో నివాళి అర్పిస్తున్న అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి, అన్నదానం ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జ్ కాశీనాథ్, బేస్తవారపేటలో నివాళి అర్పిస్తున్న తహసీల్దార్

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

అగ్నిమాపక కేంద్రం అధికారి మాల్యాద్రి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) వేసవి ఎండలు పెరిగాయని, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని, వాటి నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎర్రగొండపాలెం అగ్నిమాపక కేంద్రం, ఫైర్ అధికారి మాల్యాద్రి అన్నారు. ఎర్రగొండపాలెం అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఏటా ఎప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులు వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం విషయం తెలియగానే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి ఆంజనేయులు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అగ్నిమాపక ఉపకరణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

మార్కాపురం వన్‌టౌన్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ నాగరాజు అన్నారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం ఆయన అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. అగ్నిమాపక సాధనాలు పరిశీలించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

కంభం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కంభం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక కేంద్రం ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష, అగ్నిమాపక అధికారి పిచ్చయ్యచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాల గురించి, నివారణ చర్యలను వివరించారు.

మహిళల సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 17వ సచివాలయంలో సోమవారం బీసీ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ స్వయం ఉపాధితో ఎదగడానికి కుట్టుశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం మహిళలకు ప్రభుత్వం కుట్టుమిషన్లను కూడా అందిస్తుం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సిలర్ నాలి కొండయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ షేక్ మౌలాలి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు దొడ్డ రవణమ్మ, పఠాన్ హుసేన్‌ఖాన్, దూదేకుల నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

గిద్దలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా లచ్చుమ్మపేట వద్ద ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతలకు భారీగా నగదు బహుమతులు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రైతుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నియమితులైన బైలడుగు బాలయ్య, టీడీపీ మండల అధ్యక్షులు యోగానంద్, టీడీపీ నాయకులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతిని ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయం

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర ఆవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షణీయమని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అవతరణకు పోరాడిన అమరజీవిని ఎప్పటికీ మర్చిపోరాదని ఇకపై ఏటా ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం తెలుగు వారందరికీ ఆనందదాయ కమన్నారు. ఈ నెల 16న కనిగిరిలో జరుగనున్న అమరజీవి 125వ జయంతి వేడుకలను ఆర్యవైశ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, యక్కలి కాశీవిశ్వనాధం, బొంతల సుధీర్, సముద్రాల రమేష్, బొంతల హరి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై చెన్నయ్య నగరోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నయ్యకు సోమవారం సింహ వాహనసేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి సింహవాహనంపై వేంచేపు చేశారు. సృష్టిలో ఇతర ప్రాణులకు లేని విశిష్టత సింహానికి ఉందని, ధర్మరక్షణకై మహావిష్ణువు నృసింహ స్వరూపాన్ని ధరించి ఈ ఉత్సవాలలో నృసింహాలంకారంలో సింహాన్ని అధిష్టించి రావడం, దుష్టజన రక్షణకు సంకేతం అని అప్పనాచార్యులు తెలిపారు. ఉభయదాతలు పగలు జలప్రోలు దక్షిణామూర్తి శర్మ, రాత్రి చల్లూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో నగరోత్సవం నిర్వహించారు. అడుగడుగునా స్వామిని భక్తులు దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించారు. పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు శేష వాహనంపై నగరోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీ చెన్నకేశవస్వామి శేషవాహనంపై నగరోత్సవంలో విహరించనున్నారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం

గిద్దలూరు : మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మరకతలింగ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రతిష్ఠ మహోత్స వం వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో కాశీవిశా లాక్షి సమేత మరకతలింగ కాశీవిశ్వేశ్వర స్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ప్రత్యేక పూజల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా కుంభాభిషేకాన్ని, స్వామి వారి శాంతికల్యాణ మహోత్సవాన్ని నిర్వహిం చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త సూరె చిన్నపీరయ్య, దాతలు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



నూతనంగా ప్రతిష్ఠించిన కాశీవిశ్వేరుడు, గంగమ్మతల్లి

శేషవాహనంపై స్వామివారు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని వెంకటాద్రిపాలెంలో వేంచేసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడవరోజు సోమవారం స్వామివారికి ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారు శేషవాహనంపై దర్శనమిచ్చారు. ఉభయ దాతలు గోపాలుని సుబ్బలక్ష్మమ్మ, గోపాలుని రాఘవేంద్ర ప్రవీణ్, గోపాలుని ప్రకాశరావులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు.


సింహ వాహనంపై చెన్నకేశవుడు

గంగమ్మకు పూజలు

మండలంలోని మురారిపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతర సందర్భంగా సోమవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. సరైన సమయంలో వర్షాలు పడి రైతులకు, ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించారు. ముందుగా మహిళలు పొంగలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


బాధ్యతలు స్వీకరించిన కృష్ణపావని

వెలిగండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ జి.కృష్ణపావని అన్నారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆమె వెలిగండ్లకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నిమాపక శాఖ వారోత్సవాలు ప్రారంభం

దర్శి ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వారోత్సవాలను దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం పనిచేయటంవల్ల అగ్నిప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో నష్టం జరగకుండా నివారించగలుగుతున్నామన్నారు. ఆధునిక సాంకేతిక టెక్నాలజీని వినియోగించుకొని మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాకక శాఖ అధికారి చేజర్ల జాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పామూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన జీవీ దుర్గామహేష్, జి.లక్ష్మీచైతన్య, హోకికయన్‌లకు నిర్వాహకులు కాలనీడి బాలు, అక్కి దాసరి, వి.సత్యనారాయణ, ఆదినారాయణలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సజన, హెచ్ఎం పి.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ షేక్ నాగూర్‌వలి తెలిపారు. దొనకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నీ గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కురిచేడు మండల సేవకుల కార్యవర్గం

కురిచేడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల సేవకుల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంభంపాటి సామేలు, ఉపాధ్యక్షుడిగా వి.గురవయ్య, కార్యదర్శిగా స్టాలిన్, సహాయకార్యదర్శిగా హనోక్, కోశాధికారిగా బి.త్రిపురయ్య, సభ్యులుగా దేవసహాయం, ప్రభాకర్, సలహాదారులుగా కె.రవి, నిమ్మేష్, ఖాసిం, రాజశేఖర్‌లు ఎంపికయ్యారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కురిచేడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కురిచేడు - పొట్లపాడు దారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గంగదొనకొండకు చెందిన భూపతి నరసయ్య కురిచేడు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈసమయంలో చింతలచెరువు గ్రామానికి చెందిన వెంకటేష్ దొనకొండ నుంచి వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నరసయ్య, వెంకటేష్‌లకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది భాషా, నరేష్‌లు వారికి ప్రాథమిక చికిత్స చేసి కురిచేడు ప్రాథమిక ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు ముండ్లమూరు మండల సర్వసభ్య సమావేశం

ముండ్లమూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఆర్.జనార్దన్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 10వేలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు సమర్పించిన కానుకల ఆదాయం రూ.1,10,393 వచ్చినట్టు ఈవో నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.60,880, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,480, అన్నదాన పథకానికి రూ.24,033, స్వామివారికి శ్రీపాద కానుకల ద్వారా రూ.9 వేలు వచ్చినట్లు ఈవో తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- ఊరూరా జయంతి వేడుకలు
- పలు కార్యాలయాల్లో చిత్రపటానికి నివాళులు


కనిగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో బుల్లా బాలబాబు, తాతపూడి బ్రాక్, రామ్మోహన్, చిరంజీవి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రవిశంకర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జయంతి వేడుకలు నిర్వహించారు. సీపీఐ నాయకుడు వై.రవీంద్రబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జైభీం నాయకుడు సూరె రాజన్న అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ రోడ్డులో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హెచ్ఎంపాడు మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్) ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీసీపల్లి: అంబేడ్కర్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. పీసీపల్లిలో ఆయన చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్యా పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే, పలుచోట్ల జరిగిన జయంతి వేడుకల్లో పలువురు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

పామూరు: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే, పలుసంఘాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనే ప్రభుత్వ లక్ష్యం

దర్శి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహాయోధుడు డాక్టర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యం గా ఎన్టీఆర్ పేదల అభ్యున్నతి కోసమే తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.సుధారాణి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ జి.స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. తాళ్లూరులో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరులో జైభీమ్ శ్రేణులు సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు.

కురిచేడు: మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం దొనకొండలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భారీ కేకు కట్ చేశారు. ఒబ్బాపురంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ఆధ్వర్యం లోనూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రైల్వే పించనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుండి అడ్డరోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.


దర్శిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ లక్ష్మి, పాపారావు తదితరులు

ముండ్లమూరు: మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లోనూ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముండ్లమూరులో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పార్టీకి మంచిరోజులు

- పార్టీ అధికార ప్రతినిధి తులసీరెడ్డి


తులసీరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మంచిరోజులు వస్తున్నాయని ఆపార్టీ అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసీరెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలకు పరాభవం తప్పదన్నారు. కాంగ్రెస్‌కు ఘన విజయం తథ్యమని జోస్యం చెప్పారు. వివిధ కార్యక్రమాల నిమిత్తం కనిగిరి ప్రాంతానికి సోమవారం వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి పట్టిన రాహు కేతువులు వైసీపీ, టీడీపీ అని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో జగన్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తే, కూటమి పాలనలో సీఎం చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి నిప్పుల పొయ్యిలో పడినట్లుగా తయారైందన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి యువతను గంజాయి స్మగ్లర్లుగా మార్చిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఊరికో నాలుగు బెల్టు షాపులతో అధ్వానంగా మారిందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారం మోపుతుందన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరెడ్డి, వేల్పుల రాజశేఖర్, మల్లికార్జునరెడ్డి, కోటేశ్వరరావు, అమర్, తదితరులు పాల్గొన్నారు. తొలుత తులసీరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు.

దడపుట్టిస్తున్న గ్రామసింహాలు

- శునకాల దాడిలో పలువురికి గాయాలు
- దొనకొండలో స్వైరవిహారం


దొనకొండలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు


వీధికుక్కల దాడిలో గాయపడిన జలీల్

దొనకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దొనకొండలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధులో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే వీటి భారినపడి పలువురు గాయాలపాలయ్యారు. రెండు రోజులక్రితం దొనకొండకు చెందిన జలీల్, ఆదివారం పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కొండా దాసు గాయపడ్డాడు. రోడ్లపై పరుగులు తీస్తూ హఠాత్తుగా వాహనాలకు అడ్డుపడటంతో వాహన చోదకులు క్రిందపడి గాయాలపాలవుతున్న సంఘటనలు ఇటీవలకాలంలో చోటుచేసుకుంటున్నాయి. వీధికుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో వీధికుక్కలను పట్టుకొని దూరప్రాంతాల్లో విడిచిపెట్టేవారు. ప్రస్తుతం అధికారులు వీటి నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవలేదని ప్రజలు వాపోతున్నారు.

దొనకొండలో ఒకవైపు వీధికుక్కల బెడద, మరోవైపు పందులు బెడద తీవ్రమైంది. వీటితో ఎప్పుడు ఎటువంటి ప్రాణాపాయ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటి నిర్మూలనకు తక్షణ చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిని వివరణ కోరగా సోమవారం జరిగే గ్రామసభలో సభ్యులతో తీర్మానం చేపట్టి వీధికుక్కలు, పందుల నిర్మూలనకు తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

డీజీపేటలో ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో కదలిక

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీజీపేట గ్రామంలో మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రామంలో 167/బి జాతీయ రహదారి పక్కనున్న అనువైన స్థలాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మండలంలో రెండవ ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఏర్పాటుచేస్తూ అందుకు అవసరమైన ఇద్దరు డాక్టర్లు నియమించారే గాని వైద్యశాల నిర్మాణానికి స్థలంతోపాటు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. దాంతో వైద్యులు ఉన్నా వైద్యశాల లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు సరైన వైద్యసేవలు పొందలేకపోతున్నారు.

ఈనేపథ్యంలో గత నెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులతో పాటు డాక్టర్ మహేష్ వైద్యశాల నిర్మాణ ఆవశ్యకత గురించి సభ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ఉగ్ర సంబంధిత గ్రామ వీఆర్వోను పిలిపించి వైద్యశాల నిర్మాణానికి తగిన స్థల సేకరణ చేయాలన్నారు. ఈక్రమంలో ఆయన సోమవారం వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బొయిళ్ల నారాయణరెడ్డి, ఎస్సి మాలకొండయ్య, చెరుకుపల్లి వెంకటరెడ్డి, చావాశేకర్, బత్తుల రమణయ్య, ఏ.రామకృష్ణంరాజు, పావళి తిరుపతయ్య, గోడా జయరాములు, కె.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.


వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

అనంతరం సీఎస్‌పురంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉగ్ర ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవాని తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని

కురిచేడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదొనకొండ గంగాభవాని అమ్మవారి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ శివ బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విద్యుత్ ప్రభలపై భక్తులతో మాట్లాడారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

వెలిగండ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెలిగండ్లలో కొలువైన పోలేరమ్మ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అర్చన, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు. వెలిగండ్ల పోలీసులు భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపంటలతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆక్షించారు

అయ్యప్ప దేవస్థానంలో ప్రత్యేక పూజలు

పామూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామూరులోని ఒక ప్రయివేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యప్పస్వామి దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు చిమట పట్టాభి స్వామి ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బి.జయరామిరెడ్డి, కావిటి సుబ్బయ్య, గుత్తిరాజ, కేవీ రమణయ్య, పోకా నాయుడుబాబు, పందిటి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వర్షానికి కూలిన ఇంటి పైకప్పు రేకులు

దొనకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దొనకొండ పంచాయతీలోని బేతేల్‌పురంలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి ఇంటిపైకప్పు రేకులు విరిగి కిందపడ్డాయి. పాస్టర్ గాలిమూటి జార్జి కుటుంబసభ్యులు నివసించే సిమెంట్ రేకుల ఇంటిపై పెద్దపెద్ద వడగండ్లు పడ్డాయి. ముందు గదిలోని సిమెంట్ రేకులు విరిగి కిందపడ్డాయి. ఆ సమయంలో రేకుల ఇంట్లో ఉన్న జ్యోతి, భాను అనే మహిళలు ఇరువురు చిన్నారులను తీసుకొని భయాందోళనతో పక్కగదిలోకి పరుగులు తీశారు. అనుకోని ఈ సంఘటనతో ప్రాణాపాయ ప్రమాదం తప్పిందని కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రమాదేవి వీఆర్వో మాచర్లను విచారించాలని ఆదేశించారు. ఆనివేదికను కలెక్టర్‌కు పంపుతామని ఆమె తెలిపారు.

నిరాశ మిగిల్చిన రైల్వే డీఆర్ఎం పర్యటన

దొనకొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఆర్ఎం సుదేష్టసేన్ సోమవారం గుంటూరు నుంచి నంద్యాల వరకు ప్రత్యేక రైలులో పర్యటించారు. దొనకొండకు చెందిన రిటైర్డ్ రైల్వే పించనర్స్ మరికొందరు గ్రామస్థులు డీఆర్ఎంను కలిసి ప్రధానంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం, మరికొన్ని సమస్యలను విన్నవించేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. డీఆర్ఎం ప్రయాణించే ప్రత్యేక రైలు దొనకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకొని ప్లాట్‌ఫారం 1లో ఆగింది. అయితే, డీఆర్ఎం రైలు దిగకపోవటం, తిరిగి మూడు నిమిషాల్లోనే కదిలింది. డీఆర్ఎం రైల్లో నుండి కిందకు దిగితే తమ ప్రధాన సమస్యలు విన్నవిద్దామనుకున్న ప్రజల ఆశలు అడిఆశలయ్యాయి. దీంతో ప్రజలు నిరాశతో వెనుతిరిగారు.

క్షణికావేశంలో అనర్థాలు

పామూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య ఏర్పడే మనస్పర్థల నేపథ్యంలో క్షణికావేశంతో తీసుకొనే చర్యలతో అనేక అనర్థాలు ఏర్పడుతాయని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో ఆదివారం మాటామాట పెరిగి భార్య మార్తమ్మను భర్త రమేష్ రోకలి బండతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతికిగల కారణాలను విచారించేందుకు సీఐ ఘటనాస్థలిని పరిశీలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యానికి బానిసై క్షణికావేశంలో తీసుకొనే నిర్ణయాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ వెంట వీఆర్వో మండ్ల శ్రీనివాసులు ఉన్నారు.

జన్మభూమి రుణాన్ని తీర్చుకోవాలన్న సంకల్పం అభినందనీయం

తాళ్లూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన గ్రామానికి తమ వంతు చేయూతనిచ్చి రుణం తీర్చుకునేందుకు స్వర్గీయ సోమా పుల్లయ్య కుమారులు ముందుకు రావటం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గుంటిగంగ వందవ వార్షిక తిరునాళ్ల సందర్భంగా పుల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు భక్తులకు ఆరోగ్య చికిత్సలు చేయాలన్నతలంపుతో ఒంగోలు శ్రీరామ్ మల్టిసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంత మైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుండగా సోమా కుటుంబీకులు తమ వంతుగా ప్రజలకు వైద్య చికిత్సలు అందించేందుకు క్యాంపు ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు. 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, షేక్ కాలేషావలి, జనరల్ మెడిషన్ వైద్యనిపుణులు కొప్పోలు సౌమిత్ర పల్లవ్, నిర్వాహకులు సోమా ఆంజనేయులు, సోమా వెంకట సుబ్బారావు, సోమా శ్రీకృష్ణ మురళీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి డీఎస్పీ అభినందనలు


విద్యార్థినిని సత్కరించి అభినందించిన డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన షేక్ నజ్మాను డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ సోమవారం తన కార్యాలయంలో అభినందించి సత్కరించారు. పట్టణంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహ్మద్ అనే వ్యక్తి కుమార్తె బైపీసీలో 989 మార్కులు సాధించింది. చిరువ్యాపారం చేసుకుంటూ తన కుమార్తెను చదివిస్తున్న మహ్మద్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు వద్ద సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొనటంతో గ్రామానికి చెందిన కోడిగం సహదేవుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు సెంటర్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా అద్దంకి నుంచి కెల్లంపల్లి పంచాయతీ నందమూరినగర్‌కు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. సహదేవుడికి తీవ్రగాయాలుకాగా, వాహన చోదకుడికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సహదేవుడిని 108 అంబులెన్స్‌లో దర్శిలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



● ప్రజా వేదికకు హాజరైన జనం



స్ఫూర్తి.. విదేశీ విద్యానిధి

'దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆ మహనీయుని స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.' అని సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై తమకున్న చిత్త శుద్ధిని మరో మారు విస్పష్టం చేశారు. గత పాలకులు కక్షపూరితంగా అమరావతిని నాశనం చేస్తే, ప్రజల ఆశీస్సులతో ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రతి దళిత బిడ్డకు అత్యున్నత విద్యను అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మళ్లీ అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి పథకాన్ని ప్రారంభిస్తామని, దళిత కుటుంబాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందజేస్తామని సీఎం వరాల జల్లు కురిపించారు.

- అంబేడ్కర్ విదేశీ విద్యానిధి ప్రారంభిస్తాం
- ఎస్సీ విద్యార్థులకు అత్యున్నత విద్యనందించడమే లక్ష్యం
- త్వరలో మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు
- రాష్ట్రాన్ని, అమరావతిని పునర్నిర్మిస్తున్నాం
- దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు అంబేడ్కర్
- ఆయన స్ఫూర్తితో పీ- 4 పథకం రూపకల్పన
- అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- పొన్నెకల్లులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లులో సోమవారం నిర్వహించిన వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రూ. 102 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య దశ, దిశ మార్చిన ఘనత అంబేడ్కర్‌దేనన్నారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించడంతో పాటు, సామాజిక న్యాయం, మౌలిక హక్కులు, సమానత్వం గురించి అందులో పొందు పరిచారని వివరించారు. రాజ్యాంగం ఒక పేపరో, పుస్తకమో కాదని, పవిత్రమైన గ్రంథమని సీఎం పేర్కొన్నారు. అంబేడ్కర్ ఏ ఒక్కరికో, వర్గానికో ప్రతినిధి కాదని, అందరివాడని కొనియాడారు.

● పేదలపై వైసీపీ కపట ప్రేమ!

ఆవిర్భావం నుంచి దళితుల సంక్షేమానికి తెలుగుదేశం పెద్దపీట వేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. 2002లో ముందడుగు కార్యక్రమం ద్వారా స్టడీ సెంటర్లు పెట్టి ఎస్సీ, ఎస్టీ పిల్లలను చదవించామన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా పేద విద్యార్థులను చదివిస్తామని, ఈ పథకాన్ని మరింత మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 15 లక్షలు, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులకు రూ. 10 లక్షలు ఆర్థిక సాయం చేశామని సీఎం గుర్తుచేశారు. 2014-19 మధ్య సుమారు 7 వేల మందిని చదివించేందుకు రూ.467 కోట్లు వెచ్చించామని తెలిపారు. అదే కాలంలో 619 మంది ఎస్సీ, 55 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.50 కోట్లు వ్యయం చేయగా.. గత ప్రభుత్వం కేవలం 430 మందినే చదివించిందని దుయ్యబట్టారు. దీనిని బట్టి పేదలపై వారికి ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సబ్ ప్లాన్ తెచ్చామని, ఎస్సీ రైతుల కోసం రూ.1,300 కోట్లు, హార్టికల్చర్ రంగంలోని ఎస్సీల కోసం రూ. 130 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ. 1,253 కోట్లు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.1,200 కోట్లు, జలజీవన్ మిషన్ కింద రూ. 478 కోట్లు ఖర్చు చేస్తానని సీఎం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,241 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 2,35,600 మంది విద్యార్థులకు రూ.1,331 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

● దళిత కుటుంబాలకు సంక్షేమం..

రాష్ట్రంలో 21 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని, వారి కోసం 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని, 200 యూనిట్లు వాడుకుని మిగిలింది ప్రభుత్వానికి ఇస్తే యూనిట్‌కు 2.09 పైసలు ఇస్తామని ప్రకటించారు. దానివల్ల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఇల్లు కట్టుకునేందుకు రూ.50 వేలు అదనంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రూ. 780 కోట్లు ఇందుకు ఖర్చవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన నీరు, అర్హులకు ఉచిత విద్యుత్, ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, ఇంటర్నెట్, మరుగుదొడ్ల నిర్మాణం, సొంతింటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రముఖ వ్యక్తి.. గొప్ప వ్యక్తి కావాలి

ఏ సమాజం పురోగతి అయినా అందులోని బలహీన వర్గాల అభ్యున్నతిపై ఆధారపడుతుందని అంబేడ్కర్ వ్యాఖ్యలను సభలో సీఎం చంద్రబాబు ఉటంకించారు. ఒక ప్రముఖ వ్యక్తికి, గొప్ప వ్యక్తికి వ్యత్యాసం.. గొప్ప వ్యక్తి సమాజ సేవకుడిగా ఉండేందుకు సిద్ధపడతాడని ఆయన వివరించారు. 'గొప్ప వ్యక్తి కావాలంటే పేదలకు అండగా నిలబడి, వారిని పైకి తేవాలి. అప్పుడు మీరు గొప్ప వ్యక్తులవుతారు. నేను ఇచ్చిన మాట ప్రకారం పేదలకు అండగా నిలబడతాను. పేదలే దేవుళ్లు సమాజమే దేవాలయం అని చెప్పిన ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందు కెళ్తున్నాం.' అని సీఎం పునరుద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు మంచి స్థానాల్లో ఉన్నారని, 2047 నాటికి దేశంలోనే నంబరు వన్ స్టేట్‌గా ఏపీ నిలుస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఓ వైపు సంక్షేమం - అభివృద్ధి, మరోవైపు సుపరి పాలన ఇదే ఎన్డీఏ ప్రభుత్వ విధానమని చంద్రబాబు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, కోవెలమూడి రవీంద్ర, మద్దిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ..





పొన్నెకల్లులో చెక్క సెంట్రింగ్ చేసే అశోక్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు





బడ్డీకొట్టు నిర్వాహకురాలు బుర్రా చిన్నమ్మాయితో మాట్లాడుతూ.. బైక్ మెకానిక్ ప్రవీణ్ వద్ద పరికరాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



చిన్నారికి తినిపిస్తూ..

సర్వే.. సరిగా చేయండి

- వర్క్ ఫ్రం హోం సర్వేలో కొరవడిన చొరవ
- గుంటూరులో ముందుకు కదలని వైనం
- సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని
- జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం ఆదేశం
- పల్నాడులో కాస్తంత మెరుగు

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం(డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వేలో గుంటూరు జిల్లా వెనకబడింది. రాష్ట్రంలో ఎక్కువ పెండింగ్ ఉన్న ఆరు జిల్లాల్లో ఒకటిగా ఉండటంతో ఈ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించి సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేయించాలని సూచించింది. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరిని సర్వే చేయాల్సిందేనని, ప్రస్తుతం చేస్తున్న పని, వర్క్ ప్రొఫైల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అన్ని వివరాలు సేకరించాలని స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న గుంటూరు జిల్లాలోనే ఎక్కువమంది వర్క్ ఫ్రం హోం విధానంలో ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. అలాంటిది ఇక్కడే సర్వే సక్రమంగా జరగని పరిస్థితి నెలకొన్నది.

రాష్ట్ర ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని నిరుద్యోగులకు ఇంటి నుంచే పని చేసే ఉద్యోగాలు కల్పించేందుకు నిర్ణయించింది. ఇందు కోసం వర్క్ ఫ్రం హోం వాతావరణం పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. భవనాలు నిర్మించి హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా కల్పించి అక్కడ సిస్టమ్స్ ఏర్పాటు చేయడం వంటివి చేపట్టబోతున్నది. ఈ నేపథ్యంలో ఇంటి వద్దనే ఉంటూ పని చేసేందుకు ఆసక్తి కలిగిన వారి వివరాలను సేకరించాలని గత నెలలో నిర్ణయించింది. ఆ మేరకు ఒక యాప్‌ని రూపొందించి సర్వే చేపట్టాల్సిందిగా ఆదేశించింది. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు ప్రారంభంలో ఈ సర్వేపై చొరవ చూపించారు. ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో గుంటూరు జిల్లాలో సర్వే చేయాల్సిన కుటుంబ సభ్యుల సంఖ్య లక్షల్లోనే ఉన్నది.

● గుంటూరు జిల్లాలో మొత్తం 5 లక్షల 13 వేల 193 కుటుంబాలు ఉండగా 11 లక్షల 25 వేల 89 మంది సభ్యులున్నారు. ఇప్పటివరకు 6 లక్షల 20 వేల 105 మంది సర్వేని పూర్తి చేయగా ఇంకా 5 లక్షల 4 వేల 984 మందిని సర్వే చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సర్వే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వం సూచిం చింది. ● పల్నాడు జిల్లాలో 4 లక్షల 99 వేల 538 కుటుంబాలకు 11 లక్షల 22 వేల 857 మంది సభ్యులున్నారు. వారిలో 6 లక్షల 88 వేల 558 మంది సర్వే పూర్తి అయిపోయింది. ఇంకా 4 లక్షల 34 వేల 299 మంది సర్వే పెండింగ్‌లో ఉన్నది. ● బాపట్ల జిల్లాలో 3 లక్షల 61 వేల 397 కుటుం బాలుండగా 7 లక్షల 97 వేల 448 మంది సభ్యులున్నారు. వీళ్లల్లో 6 లక్షల 23 వేల 94 మంది సర్వే పూర్తి అయినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇంకా కేవలం లక్షా 74 వేల 354 మందిని సర్వే చేస్తే ఈ జిల్లాలో పూర్తి అవుతుంది.



సర్వే పూర్తయితేనే స్పష్టత

మూడు జిల్లాల్లో వర్క్ ఫ్రం హోం సర్వే 100 శాతం పూర్తి అయితేనే ఎంతమంది నిరుద్యోగులు ఇంటి వద్దనే ఉండి పని చేయాలని కోరుకుంటున్నారనే దానిపై స్పష్టత వస్తుంది. అలానే ఎవరెవరు ఎలాంటి పనులు చేయాలని ఆసక్తి చూపిస్తున్నారో తెలుస్తుంది. ఆ మేరకు వాళ్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగం చేయడానికి సిద్ధం చేయవచ్చు. అలానే ఉద్యోగాల విభజన ప్రక్రియ సులభతరం అవుతుంది.

ఆశలు నేలకొరిగి..

- అకాల వర్షాలకు పంటలు ధ్వంసం
- విరిగిన బొప్పాయి, మొక్కజొన్న, అరటి తోటలు

బాపట్ల, అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం జిల్లా రైతులను అతలాకుతలం చేసింది. పంట చేతికొచ్చే సమయంలో కర్షకులు పెట్టుకున్న ఆశలను ఒక్కసారిగా ఈదురు గాలులు నేలకూల్చాయి. నిద్ర లేచి పొలం వైపు వెళ్లిన హలధారులకు పడిపోయిన పంటలు కన్నీటిని మిగిల్చాయి. ఆదివారం సాయంత్రం, అర్ధరాత్రి ఈదురు గాలులు విజృంభించాయి. అద్దంకి నియోజకవర్గంలో ప్రధానంగా మొక్కజొన్న, బొప్పాయి, అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బల్లికురవ, అద్దంకి, పంగులూరు, కొరిశపాడు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో మొక్కజొన్నపంట వందల ఎకరాలలో నేలకొరిగింది. దీంతో ఎకరాకు సుమారు రూ. 50 వేల నుండి రూ.70 వేల వరకు నష్టం వాటిల్లింది. అద్దంకి మండలంలోని కుంకుపాడులో చల్లా కోటేశ్వరరావుకు చెందిన నాలుగు ఎకరాల బొ ప్పాయి తోట విరిగిపోయింది. సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. మక్కెనవారిపాలెంలో అరటి తోటలు దెబ్బతిన్నాయి.

మొక్కజొన్నకు అపార నష్టం

అకాల వర్షం మొక్కజొన్న రైతుకు తీవ్ర ఆవేదనను మిగిల్చింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 1,400 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు తేలింది. ఇవి ప్రాథమికమేనని, తుది గణాంకాలు వచ్చేసరికి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉండొచ్చని తెలుస్తోంది. జిల్లాలోని 19 గ్రామాల పరిధిలో 402 మంది రైతులకు నష్టం వాటిల్లగా వీరంతా మొక్క జొన్న సాగు చేసిన వారే కావడం గమనార్హం. అత్యధికంగా పంగులూరు మండలంలోని 10 గ్రామాల పరిధిలో 1,050 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. 310 మంది రైతులకు నష్టం వాటిల్లింది. బల్లికురవలో 5, అద్దంకిలో 2, కారంచేడులోని 2 గ్రామాల్లో 92 మంది రైతులకు చెందిన 350 ఎకరాల మొక్కజొన్న నేలకొరిగింది. అలాగే 48 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. బొప్పాయి 32, అరటి 16 ఎకరాల్లో దెబ్బతినగా.. అంచనా నష్టం రూ.42 లక్షల వరకు ఉంటుందని యంత్రాంగం లెక్కగట్టింది. 25 మంది రైతులు ఉద్యాన పంటలు నష్ట పోయారని ఉద్యాన శాఖ తెలిపింది.



కుంకుపాడులో గాలులకు విరిగిపడ్డ బొప్పాయి చెట్లు

తెలుగు జాతి గౌరవ ప్రతీక ఎన్టీఆర్

- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి గొట్టిపాటి

భీమవరం(పర్చూరు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచం నలుమూలల చాటిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకే దక్కుతుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం భీమవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలకు అండగా నిలిచారన్నారు. 43 సంవత్సరాల సుదీర్ఘకాలంలోనూ పార్టీ చెక్కుచెదరని విధంగా ఉందంటే అది నందమూరి తారక రాముని ఘనత అన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అన్న నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాహిత పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతురావు, పొద వీరయ్య, శ్రీహరి, సంషుద్దీన్, నాగేశ్వరరావు, చిరంజీవి, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య, రాజశేఖర్‌బాబు

పిడుగుపాటు

- చీరాల పరిధిలో రెండుచోట్ల ఘటన
- ఒకే కుటుంబంలో నలుగురికి గాయాలు
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే కొండయ్య పరామర్శ



గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి సమీర, ఆశీర్వాదం



వాడరేవు(చీరాల), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. బుర్లవారిపాలెంలో పిడుగు పడడంతో చెట్టు దగ్ధమైంది. అలాగే వాడరేవులో ఓ ఇంటిపైనా పిడుగు పడింది. మత్స్యకారులు శాంతి, సోదరుడు పుక్కళ్ల ఆశీర్వాదం కుటుంబ సభ్యులు ఆర్థిక స్తోమత లేక ఈ ఇంటిలోనే నివాసం ఉం టున్నారు. పిడుగు పాటు సమయంలో ఇంట్లో ఉన్న ఆశీర్వాదం, మేనకోడలు పిక్కి సమీర తీవ్రంగా గాయపడ్డారు. సమీర సోదరి రమ్యకు, మరో చిన్నారి మైథిలికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంటి స్లాబు శిథిలమైంది. వస్తువులు పాడైపోయాయి. గాయపడిన కుటుంబ సభ్యులను హుటాహుటిన చీరాలలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య సోమవారం హాస్పిటల్‌కు చేరుకుని పరామర్శించారు. అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవలందించాలని డాక్టర్‌కు సూచించారు. నిలువ నీడ కోల్పోయిన తమను ఆదుకోవాలని అధికారులను బాధితులు వేడుకొంటున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపీచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్ ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.



రామాయపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని రామాయపాలెంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు, మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం మంత్రి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రామాయపాలెం - తిమ్మాయపాలెం రోడ్డు మరమ్మతులకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు పూర్తి స్థాయిలో నిర్మిస్తామని తెలిపారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శింగయ్య, తహసీల్దార్ శ్రీచరణ్, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మాజీ సర్పంచ్ వేములపాటి సుబ్బారావమ్మ, కరి పరమేష్, రాజశేఖరరెడ్డి, దయానందం, వసంతరావు, పరిటాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ జె.వెంకటమురళి ముందుగానే ప్రకటించిన విధంగా ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగదు బహుమతులు అందజేశారు. బైపీసీలో 975మార్కులు సాధించిన చీరాల ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కె.ధాత్రికి రూ.10వేలు, ఎంపీసీలో 975మార్కులు సాధించిన చీరాల ప్రభుత్వ కళాశాల విద్యార్థిని షేక్.సమీరాకు రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో నీటి కుంటలోపడి మృతి చెందిన బాలుడు జి.ప్రవీణ్‌కుటుంబానికి కూడా కలెక్టర్ 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీ, ప్యానల్ స్పీకర్, హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు కలిసి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని హామీనిచ్చారు.



చీరాల ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కె.ధాత్రి, పర్చూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని సమీరాకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

రుణాలతో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ఎమ్మెల్యే కొండయ్య



ఇద్దరు కుమారులతో కలిసి పొదుపు సంఘాల మహిళలకు చెక్కును అంజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, సీఎంఎం

చీరాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పొదుపు సంఘాలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను వినియోగించుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం నుంచి పొదుపు సంఘాలకు విడుదలైన రూ.4.40కోట్ల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎస్సీఎస్టీ, బీసీలకు చెందిన 138 పొదుపు సంఘాలకు ప్రభుత్వం రుణ సాయాన్ని అందించినట్లు వివరించారు. త్వరలో సుమారు 50 మంది మహిళల జీవనోపాధికి ఆటోలను అందించనున్నట్లు ప్రకటించారు. ప్రతి ఇంట్లో పారిశ్రామిక వేత్తలను చూడాలన్న సీఎం చంద్రబాబు ఆశయాన్ని మహిళలు నెరవేర్చాలని కొండయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా. మహేంద్రనాథ్, యువనాయకుడు గౌరీ అమర్‌నాథ్, కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా సీఎంఎం కొండయ్య పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

20 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా అద్దంకిలో ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించే జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ కర పత్రాన్ని సోమవారం విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ ఆవిష్కరించారు. అద్దంకి పట్టణంలోని 5వ వార్డు రాజీవ్‌కాలనీ తెలుగు యువత ఆధ్వర్యంలో రాజీవ్‌కాలనీ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, 3వ బహుమతిగా రూ.15వేల నగదు బహుమతులను విజేతలకు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. నేషనల్ స్థాయిలో ఐఎన్‌టీఎస్‌వో లెవల్ 2 పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచిన అద్దంకి శ్రీ చైతన్య పాఠశాల 7 వ తరగతి విద్యార్థి తోట రోహిత్ వెంకట మదురిమకు ల్యాప్‌టాప్, 3వ తరగతి విద్యార్థి ఆళ్ల అక్షయకు ట్యాబ్‌ను మంత్రి రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. ప్రిన్సిపాల్ రవీంద్రబాబు, అంజుమ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఏలూరి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలని, వారికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందిస్తున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు. డాక్టరు బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపుకార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ.9లక్షల 49వేల155 విలువగలిగిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులతో ఏలూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 9 నెలలు కాలంలో నియోజకవర్గంలో 4 కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులద్వారా పంపిణీ చేశామన్నారు. ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి తిరుపతిరాజు, ఉప్పలపాటి అచ్చిరాజు, అనిల్, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు తేలప్రోలు సాంబ శివరావు, శానంపూడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.1,53,100 విరాళం

కుంకలమర్రు(పర్చూరు), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణానికి మేము సైతం అంటూ కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామస్థులు కలసి కట్టుగా ముందుకు వచ్చారు. సమిష్టిగా సేకరించిన రూ.1,53,100 విరాళాన్ని చెక్కు రూపంలో సోమవారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అందజేశారు. కార్యక్రమంలో శివరాంప్రసాద్, వాసు, మాధవి, శ్రీదేవి, టీడీపీ నాయకులు హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ అట్టర్ ఫ్లాప్!

- ఇంటర్ ఫలితాల్లో డీలా
- ఐదు పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత
- గత వైసీపీ పాలనలో హడావుడిగా ప్రారంభం
- వనరుల గురించి పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి

జిల్లాలోని హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇంటర్ ఉత్తీర్ణతలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. ఇతర యాజమాన్యాల్లోని విద్యాసంస్థలతో పోల్చితే అట్టడుగున నిలిచారు. రాష్ట్రస్థాయిలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులు సగటున 34శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 10.55శాతం తక్కువగా కేవలం 23.45 శాతం మంది మాత్రమే పాసయ్యారు. సీనియర్ ఇంటర్‌లో రాష్ట్ర ఉత్తీర్ణత 60శాతం ఉండగా.. జిల్లాలో 5.08శాతం తగ్గి 54.92శాతం మాత్రమే సాధించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి వనరులు కల్పించకుండానే వీటిని హడావుడిగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించలేదు. కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు ఫలితాల సాధనలో డీలా పడ్డారు.

ఒంగోలు విద్య, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులు సాధించిన ఫలితాలు తీవ్ర నిరాశపర్చాయి. 13 హైస్కూల్ ప్లస్‌లలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఐదు పాఠశాలలు జీరో ఉత్తీర్ణత సాధించాయి. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 226 మంది హాజరు కాగా కేవలం 53 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మైనంపాడు హైస్కూల్ ప్లస్ నుంచి 9 మంది, హెచ్.నిడమానూరు నుంచి 13 మంది, గిద్దలూరు నుంచి ఏడుగురు, కొణిజేడు నుంచి 10 మంది, కురిచేడు నుంచి 11 మంది పరీక్షలు రాయగా ఒక్కరు కూడా పాస్ కాలేదు. పాకలలో 8 మందికి ఐదుగురు, కరవదిలో 21 మందికి నలుగురు, కె.ఉప్పలపాడు నుంచి 10 మందికి 8, దేవరపాలెంలో 19 మందికి నలుగురు ఉత్తీర్ణులయ్యారు. శీలంవారిపల్లిలో 28 మందికి 16, బేస్తవారపేటలో 17 మందికి నలుగురు, ముండ్లమూరులో 31 మందికి 10, కొత్తపట్నంలో 42 మందికి కేవలం ఇద్దరు మాత్రమే పాసయ్యారు. బాలికల డ్రాపౌట్స్‌ను తగ్గించాలన్న ఉద్దేశంతో గత వైసీపీ హయాంలో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. కానీ అవసరమైన వనరులను కల్పించలేదు. మొదటి నుంచి విద్యార్థులకు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. చదువుకొనేందుకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోవడం పెద్ద మైనస్ అయ్యాయి. హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇచ్చి ఆర్థిక సౌలభ్యం కలిగించగా కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో అది లేదు. దీంతో అసలు డిప్యుటేషన్‌పై ఈ పాఠశాలల్లో చేరేందుకు టీచర్లు సుముఖత వ్యక్తం చేయలేదు. ఆ ప్రభావం గత విద్యా సంవత్సరం ఫలితాల్లోనే కన్పించింది. ఇప్పుడు ప్రభుత్వం మారినా ఎలాంటి మార్పు కన్పించ లేదు.

సీనియర్ ఇంటర్‌లోనూ తగ్గిన ఉత్తీర్ణత

హైస్కూల్ ప్లస్ సీనియర్ ఇంటర్ విద్యార్థులు కూడా తక్కువ ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో సగటున 60శాతం మంది పాస్ కాగా జిల్లాలో 5.08 శాతం తక్కువతో 54.92శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలకు 122 మంది హాజరు కాగా 67 మంది మాత్రమే పాసయ్యారు. పాకల, కె.ఉప్పలపాడుల నుంచి గరిష్ఠంగా 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కొణిజేడు నుంచి కేవలం 12.5శాతం మంది మాత్రమే పాసయ్యారు. పాకల నుంచి 10 మంది హాజరు కాగా 9 మంది, మైనంపాడు నుంచి 9 మందికి ఐదుగురు, కరవదిలో 14 మందికి 9 మంది, హెచ్.నిడమానూరులో 7మందికి ముగ్గురు, కె.ఉప్పలపాడులో 8 మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. గిద్దలూరు హైస్కూల్ ప్లస్ నుంచి 16 మంది పరీక్షలు రాయగా ఐదుగురు, దేవరపాలెంలో 8 మందికి నలుగురు, కొణిజేడులో 16 మందికి ఇద్దరు, శీలంవారిపల్లిలో 34 మందికి 23మంది పాసయ్యారు. మొత్తం మీద హైస్కూల్ ప్లస్‌ల విద్యార్థులు ఫలితాల సాధనలో వెనుకబడిపోయారు.


ఈపూరుపాలెంలో రోడ్లపై వర్షపు నీటిలో చెత్తా చెదారం

సెలవు రోజైతే పట్టించుకోరా

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం రాత్రి గంట పాటు వర్షం కురిసింది. ఈక్రమంలో మండల పరిధిలోని ఈపూరుపాలెంలో ప్రధాన రహదారులతో పాటు పలు అంతర్గత రహదారులు కూడా వర్షపు నీటితో దర్శనమిచ్చాయి. అయితే ఈ నీటిలో చెత్తా చెదారం చేరి రోడ్లు అధ్వానంగా మారాయి. సోమవారం ఉదయం నుంచే చెత్త సేకరణ జరగలేదు. ఈక్రమంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఒక వేళ సోమవారం సెలవు కావడంతో పారిశుధ్య నిర్వహణ జరుగలేదేమోనని ప్రజలు భావిస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని శాంతి కల్యాణం

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పూజారులు భాగవతుల నరసింహాచార్యులు, కొండమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వార్ల శాంతి కల్యాణం జరిగింది. 13 మంది దంపతులు శాంతి పాల్గొన్నారు. ఈవో మద్దినేని శ్రీనివారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముంచిన గాలులు.. వర్షాలు

» పలు గ్రామాలలో నేలవాలిన మొక్కజొన్న
» పంట చేతికి అందే దశలో నష్టపోయామంటున్న రైతులు


గాలుల ప్రభావానికి పడిపోయిన కోత దశలో ఉన్న మొక్కజొన్న

బల్లికురవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి వీచిన పెను గాలులు, భారీ వర్షం ప్రభావంతో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వచ్చిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట చేతి వచ్చే సమయంలో వీచిన గాలులతో పంట మెత్తం నేలవాలిందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టి మొక్క జొన్న సాగు చేశామని రైతులు తెలిపారు. బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు, చెన్నుపల్లి, కూకట్లపల్లి, గొర్రెపాడు తదితర గ్రామాలలో రైతులు మొక్కజొన్న పంటను విడతల వారీగా సాగు చేశారు. కొందరి రైతుల పంట కోత దశలో ఉండగా కొందరి రైతుల పంట కండే పాలు పోసుకొనే దశలో ఉంది. మరో 20 రోజులు ఉంటే పూర్తి స్థాయిలో నూర్పిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. అకాల వర్షాలు, పెను గాలుల ప్రభావంతో జొన్న మెత్తం నేల కరిచిందని దీని వలన తమకు తీవ్ర నష్టాలు తప్పవు అని రైతులు తెలిపారు. కింద పడి పోయిన పంట మరలా పైకి లేవడం కష్టమని కండేల విత్తనాలు రాలి పోవడం, ఫంగస్ వంటి వైరస్ కూడా వస్తుందని అరకొరగా వచ్చే విత్తనాలను కూడా వ్యాపారులు కొనుగోలు చేయరని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టం సుమారు రెండు వందల ఎకరాల్లో జరిగి ఉంటుందని రైతులు అంటున్నారు. అధికారులు వెంటనే పరిశీలన చేసి తమకు పంట నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరతున్నారు.

గాలుల ప్రభావంతో పంటంతా నేలవాలింది



మా గ్రామంలో పెను గాలుల ప్రభావంతో మొక్క జొన్న పంట నేల కరిచింది. పంట చేతికి వచ్చే సమయంలో గాలులు తమ కొంప ముంచాయి. ఎకరాకు ఇప్పటికే రూ. 30 వేల పెట్టుబడులు పెట్టాం. తీవ్ర నష్టాలు తప్పవు. కింద పడి పోయిన పంటలో కండేలు రాలి పోతున్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

పరిటాల పవన్‌కుమార్, రైతు, కొప్పెరపాడు

రేణంగివరం, కొండమూరులో..

పంగులూరు : మండలంలో ఆదివారం వీచిన బలమైన ఈదురు గాలులకు కోత దశకు చేరుకున్న మొక్కజొన్న నేలవాలి పంటకు నష్టం వాటిల్లింది. బలంగా వీచిన ఈదురు గాలులకు తోడు వర్షం పడడంతో కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్నలు, మిరపతో పాటు పొగాకు మండెలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్ర యిబ్బందులు పడ్డారు. మండలంలోని కొండమూరు, రేణంగివరం గ్రామాలలో షుమారు 150 నుండి రెండు వందల ఎకరాల మొక్కజొన్న పైరు నేల వాలి నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం రేణంగివరం, కొండమూరు, కోటపాడు గ్రామాలలో మొక్కజొన్నను ఏవో పరిశీలించారు. మంగళ, బుదవారాలలో వర్షం పడుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మొక్కజొన్న నూర్పిడి చేపట్టవద్దని, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిరపకాయ తడవకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఏవో రైతులకు సూచించారు.

మొక్కజొన్నకు నష్టం



పంట ఇంటికి వచ్చే సమయంలో వీచిన పెరు గాలులతో మొక్క జోన్న పంటకు తీవ్ర నష్టం పంట పోలంలో కండేలను పరిశీలించగా ఇంకా కోత దశకు రాలేదు. నేల కరిచిన కండేలకు ఫంగస్ వస్తుంది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి కనబరచరు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందజేయాలని.

కామినేని రమేష్, రైతు, కొప్పెరపాడు


వేంకటేశ్వర నామాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి నామాల ప్రతిష్ఠ

బల్లికురవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామస్థుల సమష్టి కృషి, విరాళాల సేకరణతో వేంకటేశ్వరస్వామి స్వామి నామాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది సుమారు రూ.10లక్షల విరాళాలను సేకరించి గ్రామస్థులు పోలేరమ్మ తల్లి దేవాలయం పక్కన వెంకటేశ్వర స్వామి పాదాలు, శంకు చక్రాల శిలలను వేద పండితులు పర్యవేక్షణలో ప్రతిష్ఠించారు. వాటికి ప్ర త్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమం, కోలాట ప్రదర్శన నిర్వహించారు.

వైభవంగా సీతారామ కల్యాణ మహోత్సవం


కల్యాణతంతును నిర్వహిస్తున్న వేదపండితులు

చినగంజాం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీలాయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న సీతారామలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఆలయ అర్చకులు గంజాం శ్రీనివాసమూర్తి, గ్రామ పురోహితులు పాండురంగ శాస్త్రి స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలతో పాటు, సహస్ర నామార్చన కార్యక్రమాలు జరిపారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితులు గంజాం రామకృష్ణాచార్యులు వేదమంత్రోత్సవాల నడుమ దంపతులచే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు వినియోగం చేశారు. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పుర వీధులలో గ్రామోత్సవం నిర్వహించి, తదనంతరం స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న 61వ అఖండ హరే రామ నామ సంకీర్తన సప్తాహం పరిసమాప్తి కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మహిళ మృతి

మార్టూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై మురకొండ పద్మ (59) మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం స్థానిక బలరాంకాలనీలో జరిగింది. పద్మకు భర్త శివరామయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె ఇంట్లో చీపుతో ఊడుస్తుండగా హీటర్ ఉన్న స్విచ్‌బోర్డు తగిలి ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ప్రైవేటు వైద్యుడు పవన్ ప్రాథమిక చికిత్సను అందించి, మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా ఆమె మృతి చెందారు. ఆమె కుమారుడు వెంకటేశ్వర రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పంగులూరు మండలం కొండమూరు గ్రామానికి కుటుంబసభ్యులు తీసుకువెళ్లారు. ఎస్ఐ సైదా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో విద్యార్థి బలవన్మరణం

కావూరివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పాసైనా మార్కులు ఊహించిన వాటికంటే తక్కువగా వచ్చాయని కానిస్టేబుల్ కుమారుడు బలవన్మరణం చెందాడు. ఈ ఘటనతో సోమవారం మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచాయతీ తులసీనగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మంచాల వీరవర్మరెడ్డి బాపట్ల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి భార్య కొండమ్మ, ఇద్దరు కుమారులు. విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో పెద్ద కుమారుడు కుశల్ రెడ్డి(17) ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో370 మార్కులతో పాసయ్యాడు. అయితే తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి విజయవాడలోని హాస్టల్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సోమవారం మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చి అంత్యక్రియలు నిర్వహించారు. మరో పది రోజుల్లో కుమారుడి పుట్టిన రోజు ఉండగా ఈ ఘటన జరగడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పంగులూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ నాగూర్ మీరా (32) మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. అద్దంకి నుంచి ఆటో పారంకోళ్ల లోడుతో గుంటూరుకు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల 15 నిముషాల సమయంలో ఆటో నడుపుతున్న నాగూర్‌మీరా ముప్పవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన మూత్ర విసర్జన కోసం వాహనం నిలిపి దిగుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఆటో డ్రైవర్‌ను ఢీకొట్టగా మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నాగూర్ మీరాది గుంటూరు సమీపంలోని చోడవరం గ్రామవాసిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు రాష్ట్ర బాలుర జట్టు ఎంపిక

పంగులూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టు ఎంపిక ఈ నెల 16న పంగులూరులో జరుగుతుందని డీఎస్‌డీవో పాల్ కుమార్ తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే బాలురు 18 ఏళ్ల లోపు (1 - 01 - 2007 తర్వాత పుట్టి ఉండాలి) వయస్సు కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి అర్హత గల బాలురు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 16వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే వారు రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి యం.సీతారామిరెడ్డికి తమ వివరాలను అందచేయాలన్నారు. ఈ ఎంపికలో శాప్ కోచ్‌తో పాటు పరిశీలకులు పాల్గొంటారని, శాప్ చైర్మన్ రవినాయుడు, వీసీ అండ్ ఎండీ గిరీష్ సహకారంతో ఈ ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికయిన జట్టు మే 5 నుంచి 9 వరకు బిహార్ రాష్ట్రంలోని గయ పట్టణంలో జరిగే 7వ యూత్ ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు.


శాంతినగర్‌లో రామారావుకు జీవనోపాధి కోసం టిఫిన్ బండిని అందజేస్తున్న ప్రకాశం జిల్లా కమ్మ సేవా సంఘం ప్రతినిధులు

అభివృద్ధికి కమ్మ సేవా సంఘం కృషి

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యా, వైద్యం, ఉపాధి, క్రీడల అభివృద్ధికి కమ్మ సేవా సంఘం కృషి చేస్తుందని ప్రకాశం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ అన్నారు. అద్దంకి మండలంలోని చక్రాయపాలెం పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో ఆళ్ల రామారావుకు జీవనోపాధి నిమిత్తం రూ.40వేల విలువ చేసే టిఫన్ బండిని ప్రకాశం జిల్లా కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. గుంటిగంగ కమ్మ సేవా సంఘం అన్నదాన సత్రానికి శాశ్వత అన్నదానం కోసం రూ.లక్ష అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిటిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘుపతిరావు, ఆళ్ల హనుమంతరావు, వెంకటేశ్వర్లు, బాపయ్యచౌదరి, మండవ సుబ్బారావు, బొడ్డపాటి వెంకట్,గోగినేని శ్రీనివాసరావు, వడ్డెంపూడి సుజాత, మోటుపల్లి వెంకటేశ్వర్లు, కోచూరి శ్రీదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం


అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

చీరాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సహాయక జిల్లా అగ్నిపమాక అధికారి వీవీ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సంబంధిత కరపత్రాలను స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రారంభించారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది, వివిధ పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అద్దంకి : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రంగారావు అన్నారు. అద్దంకిలోని మార్కెట్ యార్డులో అగ్నిమాపక కేంద్రం వద్ద సోమవారం అగ్ని మాపక వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా కరపత్రాలను డాక్టర్ రంగారావు ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించడం జరిగింది. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి


అద్దంకిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఏదో ఒక కులానికో.. మతానికో ఆపాదించడం సరి కాదని, అంబేద్కర్ అందరి వాడని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం అద్దంకి పట్టణంలోని


అంబేద్కర్‌కు నివాళులర్పించిన అనంతరం నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నంబూరివారిపాలెం, బంగ్లా రోడ్డులో అంబేద్కర్ వి గ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్య క్రమాలలో మం త్రి రవికుమార్ మాట్లాడారు. వచ్చే ఏడాది నాటికి అద్దంకిలో పెద్ద లైబ్రరీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ బహుమతులను అందజేశారు.

చీరాల : అంబేద్కర్ జాతి నాయకుడు కాదని, ఆయన జాతీయ నాయకుడని, ఆయన అందించిన రాజ్యాంగం ద్వారానే పరిపాలన సాగుతుందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో టీడీపీ కల్యాణ మండపం నుంచి ముక్కోణం పార్క్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు ఇద్దరు కుమారులు నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్, యువనాయకుడు గౌరీ అమర్‌నాథ్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, ఏఎంసీ చైర్మన్ జనార్దన రావు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగా యి. అలాగే ఆర్డీవో కార్యాలయం లో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అలాగే వైసీపీ ఇన్‌చార్జి కరణం వెం కటేష్, మాజీ ఎమ్మెల్యే ఆ మంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పాల్గొన్నారు.

భీమవరం (పర్చూరు) : డాక్టర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఇం కొల్లు మండలం భీమవరంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి గరటయ్య, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబుతో కలసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పర్చూరు, కారంచేడు మండలాల్లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

మార్టూరు : అంబేడ్కర్ ఆశయ సాధనతోపాటు, రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కలలు గన్న సమసమాజాన్ని నిర్మించేందుకు ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. మార్టూరు, యద్దనపూడి మండలాలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు.

బల్లికురవ : అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని విశ్రాంత ఐఏఎస్, లిబరల్ కాంగ్రెస్ పార్టీ అధినేత విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన్ని గ్రామ పెద్దలు సత్కరించారు. బల్లికురవ కూడలిలో ఎస్ఐ నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు.

చినగంజాం : అంబేడ్కర్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి టీడీపీ, వైసీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ కార్లాయాల్లో అధికారులు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

పంగులూరు : అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.పంగులూరులోని పాత, కొత్త అంబేడ్కర్ కాలనీలలో యూత్ ఆధ్వర్యంలో అబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.


అంబేడ్కర్, ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మహితాద్భుతం

» పెన్సిల్ లిడ్‌పై అంబేడ్కర్ జీవిత చరిత్ర
» ఆయన జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా ఆవిష్కరణ
» గతంలో రామాయణం తదితర గ్రంథాలు, మహనీయుల చరిత్ర



మైక్రో ఆర్ట్‌తో తయారు చేసిన అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రదర్శిస్తున్న మహిత

చీరాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో మట్టిలో నుంచి మాణిక్యం పుట్టింది. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక వ్యక్తిగత సామర్థ్యం ఉంటుందని, దానిని గుర్తించి ఆచరణలో పెడితే జీవితానికి అర్థం..పరమార్థం ఉంటుందని చీరాలకు చెందిన అన్నం మహిత నిరూపించింది. తండ్రి ఆటో డ్రైవర్ నరసింహారావు, తల్లి భ్రమరాంబకు మహిత గారాల పట్టి. ప్రస్తుతం ఒంగోలులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈమె కొవిడ్ సమయంలో ఖాళీగా ఉంటూ బియ్యం గింజలపై జాతీయ పతాకం గీసింది. దీంతో ప్రముఖుల నుంచి అభినందనలు అందుకుంది. ఆమెలో ఉత్సాహం రెట్టింపయింది. ఈక్రమంలో ఆమెకు తట్టిన కొత్త ఆలోచనతో పెన్సిల్ లిడ్‌పై అద్భుతాలను సృష్టించారు. పెన్సిల్ లిడ్స్‌పై రామాయణం, మహాభారతం, భగవద్గీతతో సహా, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్, విన్సెంట్ ఫెర్రర్ చరిత్రలను లిఖించింది. ఈక్రమంలో అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు, అవార్డులను అందుకుంది. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సుమారు పదిరోజుల పాటు శ్రమించి 50 పెన్సిళ్లతో అంబేడ్కర్ జీవిత చరిత్ర మైక్రో ఆర్ట్‌ను తయారు చేసింది. ఆ ఆర్ట్‌ను సోమవారం


పెన్సిల్ లిడ్‌పై సూదితో అక్షరాలను రాస్తున్న మహిత

ఎమ్మెల్యే కొండయ్య సైతం ప్రదర్శించారు. త్వరలో ఒంగోలులో జరిగే వేడకల్లో అంబేడ్కర్ మనవడు రాజా రతన్ అంబేడ్కర్‌కు ఆర్ట్‌ను బహూకరించనున్నట్లు మహిత తెలిపారు. యువతి నైపుణ్యతను చూసి అందరూ శభాష్ అంటున్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.9	29.5
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	26
కందుకూరు	38	28





వేణుగోపాలస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

దేవతలు దిగివచ్చిన వేళ...



దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

వైభవంగా వేణుగోపాలుడి

రథోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం ఉత్సాహంగా సాగింది. ఉదయం అభిషేకాలు, విశేష అలంకారం, ప్రాకారోత్సవం జరిగింది. అనంతరం రథానికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసులు, ధర్మకర్తలు పూజలు చేసి గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి రథాన్ని ముందుకు కదిలించారు. బ్రాహ్మణవీధి, ఈఎస్ఆర్ఎం హైస్కూల్, పొట్టిశ్రీరాములు విగ్రహం, అలంకార్ సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టు సెంటర్, శివాలయం సెంటర్స్ మీదుగా తిరిగి ఆలయం వద్దకు రథం చేరుకుంది. కాగా, రథం లాగడంలో దూకుడు పెంచడంతో బ్రాహ్మణవీధి ట్రాన్స్‌ఫారం వద్ద ఇబ్బంది ఏర్పడింది. కొద్దిసేపు రథం ముందుకు కదల్లేదు. చివరకు రథం ముందుకు సాగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. అనంతరం పుష్పక విమానాల అలంకారం కనులపండువగా జరిగింది. స్వామికి నగరోత్సవం పడారుపల్లి వరకు వైభవంగా జరిగింది.



కోటూరుపల్లిలో కూలిన విద్యుత్ స్తంభం

గాలివాన బీభత్సం

కలువాయి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గాలివాన రైతన్నను ముంచుతోంది. ఆదివారం రాత్రి కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో కలువాయి మండలంలో నిమ్మ, మామిడితోటలకు నష్టం వాటిల్లింది. ఉయ్యాలపల్లి, యర్రబల్లి, కోటూరుపల్లి గ్రామాల్లో నిమ్మ చెట్లు దెబ్బతినగా, తోటలలోని మామిడి కాయలు రాలిపోయాయి. కొన్ని చోట్ల నిమ్మచెట్లు వేర్లతోపాటు నేలకొరిగాయి. కోటూరుపల్లిలో విరగడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కలువాయి, వెంకటరెడ్డిపల్లిలో ఆరబోసుకున్న ధాన్యం తడవడంతో రైతులు అవస్థలు పడ్డారు. తడిచిన ధాన్యాన్ని మండల వ్యవసాయాధికారి వీ.ప్రతాప్, వీఆర్వో కరుణాకర్ పరిశీలించారు. దెబ్బతిన్న నిమ్మతోటలను మండల ఉద్యాన అధికారి మిథాలి పరిశీలించారు.

● **అనంతసాగరం** : మండలంలోని గౌరవరం, సంజీవనగరం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. దీంతో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది.



కలువాయి : ఉయ్యాలపల్లిలో నేలవాలిన నిమ్మచెట్టు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అభిమానులు ఘననివాళులర్పించారు. నెల్లూరులోని వీఆర్సీ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికికలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మేయర్ స్రవంతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను కొనియాడారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ప్రజాసంఘాలు, ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

దూసుకొచ్చిన

మృత్యువు!

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నలుగురి మృతి

రాపూరులోనే ఇద్దరు మృత్యువాత

జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. మితిమీరిన వేగం కారణంగానే ఈ ప్రమాదాలు జరిగాయి. రాపూరులో కారు ఢీకొని ఇద్దరు, పొదలకూరులో లారీ ఢీకొని ఒకరు, దుత్తలూరులో ప్రైవేటు బస్సు ఢీకొని ఓ బాలుడు దుర్మరణం పాలయ్యారు.





మృతులు సరస్వతమ్మ, సురేష్ (ఫైల్)

రాపూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తు ఆపై మితిమీరిన వేగం ఇద్దరిని బలిగొంది. రాపూరులో వడ్ల ఆరబెట్టేందుకు వెళ్లిన బంధువులను సోమవారం సాయంత్రం వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన రామచంద్రయ్య, మల్లికార్జునలు సోమవారం సాయంత్రం నెల్లూరు నుంచి సొంతూరుకు కారులో బయలుదేరారు. రాపూరులోని తిక్కనవాటిక పార్కు వద్ద ప్రధాన రహదారిపై వడ్లు ఆరబెట్టేందుకు పట్టణానికి చెందిన గార్లపాటి సురేష్ (26), గంధం సరస్వతమ్మ (46) బైక్‌పై వచ్చి అక్కడ ఆగారు. ఈలోపు వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి సురేష్, సరస్వతమ్మలను ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా కారు డ్రైవింగ్ చేస్తున్న రామచంద్రయ్య మద్యంమత్తులో ఉన్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే రాపూరు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్థానిక ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **ప్రైవేట్ బస్సు ఢీకొని బాలుడు..**



అన్నంరెడ్డి చేతన్‌రెడ్డి (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి) : ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన దుత్తలూరు సెంటర్ సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన అన్నంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి(13) తన తండ్రి నిర్వహిస్తున్న కేఫ్ వద్దకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి బెంగళూరుకు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు వేగంగా వస్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మీ తెలిపారు. కాగా, వైసీపీ నేత ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చేతన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, వెంకటేశ్వర్‌రెడ్డిని ఓదార్చారు.

● **లారీ ఢీకొని చేనేత కార్మికుడు**



బండి రామయ్య (ఫైల్)

చేజర్ల/పొదలకూరు (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు సమీపంలో బైక్‌ను లారీ ఢీకొనడంతో చేనేత కార్మికుడు బండి రామయ్య (42) మృతి చెందాడు. చేజర్ల మండలం చిత్తలూరుకు చెందిన బండి రామయ్య తన కుమారుడికి ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ మార్కుల కోసం నెల్లూరులోని ఒక ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో వదిలిపెట్టి తిరిగి తన భార్య బండి శ్రీవాణితో కలసి స్వగ్రామానికి వస్తుండగా పొదలకూరు సమీపంలో లారీ ఢీకొంది. దీంతో బండి రామయ్య అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీవాణి తీవ్రంగా గాయపడడంతో పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో వలంటీర్లకు అందజేసిన మొబైళ్లు ఏమైనట్టు!? ఏడాది కాలంగా స్టోరూంలలోనే మూగనోము పట్టిన సెల్‌ఫోన్లను తిరిగి వినియోగంలోకి తెస్తారా!? ఇంతకూ అవన్నీ సవ్యంగానే పనిచేస్తాయా!? వీటన్నిటికీ అధికార యంత్రాంగమే సమాధానం ఇవ్వాలి. వైసీపీ హయాంలో వలంటీర్ల కోసమంటూ సుమారు రూ.8.40 కోట్లతో మొబైళ్లు కొనుగోలు చేసి, అందజేశారు. అయితే, ఏడాది క్రితం వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించిన అధికారులు వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని భద్రపరిచింది. స్టోరూంలలోనే మగ్గుతున్న ఆ మొబైళ్లను తిరిగి వినియోగంలోకి తెస్తారా!? లేదా!? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఆ సెల్‌ఫోన్లు

ఏమైనట్టు?



గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి జిల్లాలో 12వేల మందిని నియమించింది సంక్షేమ పథకాల అమలు, వలంటీర్ పరిధిలోని కుటుంబ సభ్యుల వివరాలు తదితరాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. దీని వినియోగానికి వలంటీర్లకు కొత్త సెల్‌ఫోన్లు కొనిచ్చింది. ఒక్కో ఫోన్‌ను రూ.7వేలు చొప్పున 12 వేల ఫోన్లు కొనుగోలు చేసింది. అయితే, వలంటీర్ల వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీ నాయకుల అడ్డాగా మారిపోయిందన్న ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తడం, వలంటీర్లు అధికార పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం వీరిని ఎన్నికల విధుల నుంచి తప్పించింది. దీంతో వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారానికి వాడుకునే క్రమంలో వలంటీర్లతో బలవంతపు రాజీనామా చేయించారు. ఇలా రాజకీయాలకు బలైన వలంటీర్ల నుంచి ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికార యంత్రాంగం గతంలో వారికి ఇచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు, డివైజర్లు స్వాధీనం చేసుకుంది.

● **ఏడాదిగా స్టోర్ రూముల్లోనే..**

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్ల విషయంలో ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. అలాగే ఏడాది క్రితం వారి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైళ్లు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లోని (ఆర్డీవో) స్టోర్ రూముల్లో మగ్గిపోతున్నాయి. ప్రస్తుతం అవి పనిచేసే కండిషన్‌లో ఉన్నాయా అనేది కూడా అనుమానమే. రూ.8.40 కోట్లతో కొనుగోలు చేసిన ఫోన్లను నిరుపయోగంగా పడేయటంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో రూ.8.40 కోట్లతో కొనుగోలు

ఎన్నికల వేళ స్వాధీనం చేసుకున్న అధికారులు

ఏడాదిగా స్టోరూముల్లో మూగనోము

● **సచివాలయ సిబ్బందికిస్తే..**

ప్రస్తుతం ప్రజలకు సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం తరఫున మొబైల్, సిమ్ము ఇవ్వలేదు. దీంతో వీరే సొంత నిధులతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. సిమ్ రీచార్జి, డేటా రీచార్జి ఖర్చు కూడా సచివాలయ సిబ్బందే భరించాల్సి వస్తోంది. గతంలో వలంటీర్లు పనిచేస్తున్న రోజుల్లో సచివాలయ సిబ్బందికి మొబైల్ వాడకం తక్కువ. ఇప్పుడు వలంటీర్లను లేకపోవడంతో సచివాలయ సిబ్బందిపై పనిభారం పెరిగింది. దీంతో పని వేగంగా చేయాలంటే ఎక్కువ ర్యామ్ కలిగిన మొబైళ్లు అవసరం. డేటా ఖర్చు కూడా ఎక్కువే అవుతోంది. వలంటీర్ల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైళ్లను, సిమ్ కార్డులను సచివాలయాలకు అప్పగించి, గతంలో లా రీచార్జి ప్రభుత్వమే చేయించగలిగితే తమకు కొంత ఊరటగా ఉంటుందని సచివాలయ సిబ్బంది అంటున్నారు.



ఇంత నిర్లక్ష్యమా!?

● **వీధుల్లో చెత్తగా ఎన్నికల సామగ్రి**

భారత రాజ్యాంగంలో రూపొందించిన ఎన్నికల ప్రక్రియ ఎంతో కఠిన నిబంధనలతో కూడి ఉంటుంది. కానీ, వాటి అమలులో మాత్రం అధికార యంత్రాంగం చేతులెత్తేస్తోంది. ఎన్నికలకు వినియోగించిన పత్రాలను, వాటి సామగ్రిని ఆత్మకూరు వీధుల్లో పడేశారు. సాధారణంగా ఆ సామగ్రిని ప్రత్యేక ప్యాక్ చేసి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరుస్తారు. కానీ ఎన్నికల పత్రాలు, స్వస్తిక్ స్టాంపులు, లక్కతో సీలువేసి ఉన్న కవర్లు, ఇతర సామగ్రి సోమవారం పట్టణంలోని బేకరి సమీప వీధిలో పడవేసి ఉండటం గమనార్హం. సీల్ వేసి ఉన్న కవర్లను సైతం ఓపెన్ చేయ కపోవడం విశేషం. ఇవన్నీ 2019లో జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించిన పత్రాలుగా తెలుస్తోంది.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



ఆత్మకూరులో బేకరి సమీప వీధిలో పడేసిన ఎన్నికల సామగ్రి

నాడు రూ.100 కోట్లు

నేడు రూ.291 కోట్లు

● **పెన్నా రక్షణ గోడకు పెరిగిన అంచనాలు**

వైసీపీ హయాంలో ఓ నేత తన అనుయాయులకు కాంట్రాక్ట్‌ను కట్టబెట్టేందుకు తీసుకున్న తప్పుడు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వ ఖజానాకు భారీ చిల్లు పెడుతోంది. రూ.వంద కోట్లతో పూర్తి చేయాల్సిన పెన్నా నది రక్షణ గోడల నిర్మాణం, ఇప్పుడు రూ.291.90 కోట్లకు చేరింది. మట్టి కట్ట నిర్మాణం చేస్తే సరిపోయేదానికి కాంక్రీట్ వాల్‌ను తీసుకొచ్చి ప్రభుత్వానికి భారంగా పెట్టారు. పోనీ ఈ పనులైనా పూర్తవుతున్నాయా!? అంటే అదీనూ లేదు. నాలుగేళ్లయినా సగం కూడా పనులు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులొచ్చినా పనుల్లో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈ లెక్కన చూస్తే పెన్నా రక్షణ గోడలు పూర్తవడానికి ఇంకెన్నేళ్లు పడుతుందోనన్న అనుమానం కలుగుతుంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



భగత్‌సింగ్ కాలనీ వద్ద ఆగిన పెన్నా రక్షణ గోడ పనులు

పెన్నా రక్షణ గోడల నిర్మాణం వర్కుకు మొదట తెలుగుగంగ ప్రాజెక్ట్ అధికారులు టెండర్లు పిలిచారు. అయితే వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో ఆ వర్కును రెగ్యులర్ ఇరిగేషన్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఎర్త్ బండ్ నుంచి కాంక్రీట్ వాల్స్‌కు ఎస్టిమేషన్లు రివైజ్ చేశాక రెండు కిలోమీటర్లు నిర్మించాల్సిన రక్షణ గోడ 630 మీటర్లకు తగ్గిపోయింది. రెండేళ్లలోపు పూర్తి చేయాల్సిన ఈ పనిని నాలుగేళ్లు గడుస్తున్నా 50 శాతం కూడా పూర్తి చేయలేదు. అయితే ఈ 630 మీటర్ల దూరం మాత్రమే నిర్మించి వదిలేస్తే ప్రయోజనం ఉండదు. ముంపు బారి నుంచి కాపాడాలన్న లక్ష్యం నెరవే రదు. దీంతో మిగిలిన 1.42 కిలోమీటర్లు కూడా ప్రొటెక్షన్ వాల్ నిర్మించా ల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఇరిగేషన్ అధికారులు మిగిలిన దూరానికి మరో రూ.191.31 కోట్లు అవసరమవుతుందంటూ ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.

● **పిలిచిన టెండర్ రద్దు చేశారు..!**

పెన్నా నదిలో పోటెత్తిన వరద కారణంగా నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా ఈ ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. ఈ ప్రాంతాల పరిధిలో ఎర్త్ బండ్(మట్టి కట్ట)ను నిర్మిస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముంపు ప్రాంతానికి ఎగువ భాగాన కూడా ఎర్త్ బండ్‌నే నిర్మించి ఉండడంతో దిగువన కూడా అదే పద్ధతిలో బండ్‌ను నిర్మించాలని ఇరిగేషన్ అధికారులు ఎస్టిమేషన్లు రూపొందించారు. ఇందుకు సుమారు రూ.100 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బండ్ నిర్మించే ప్రాంతంలో కొన్ని ఇళ్లు తొలగించాల్సి ఉండగా, ఆ కుటుంబాలకు పక్కనే నిర్మించిన టిడ్కో గృహాల్లో ఇళ్లు కేటాయించాలని భావించారు. ఇందుకు సంబంధించి 2021లో టెండర్లు పిలవగా ఓ కాంట్రాక్టర్ 13.37 శాతం లెస్‌కు వర్కును దక్కించుకున్నారు. అయితే వైసీపీ ముఖ్యనేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు వర్కు దక్కకపోవడంతో అప్పట్లో మంత్రిగా పనిచేసిన ఓ ప్రజాప్రతినిధి ఈ టెండర్‌ను రద్దు చేయించారు. ఆ స్థానంలో కాంక్రీట్ వాల్స్‌ను తీసుకొచ్చి టెండర్ పిలవగా ఈ దఫా 3.55 శాతం ఎక్సెస్‌కు టెండర్ కట్టబెట్టడం గమనార్హం.

● **ఎర్త్ బండ్ మంచిదేమో..!**

వైసీపీ ప్రభుత్వంలో దోచిపెట్టే ఆలోచనతో కాకుండా ఎర్త్ బండ్‌ను నిర్మించి ఉంటే రూ.వంద కోట్లతో పని పూర్తయ్యేది. ఇప్పుడు ప్రభుత్వానికి రూ.191 కోట్ల భారం తగ్గి ఉండేది. ఇప్పటికి కూడా మించిపోయిందేమీ లేదంటూ ఇంజనీర్లు చెబుతున్నారు. కొత్తగా ప్రతిపాదిస్తున్న 1.42 కిలోమీటర్ల మేర ఎర్త్ బండ్ నిర్మించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. పెన్నా బ్యారేజీ ఎగువ భాగంలోనూ ఎర్త్ బండే ఉందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్‌కు కొనసాగింపుగా ఎర్త్ బండ్‌ను నిర్మిస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. కాగా ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను సంప్రదించగా పెన్నా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణంలో మిగిలిన పనికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 420

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో రాష్ట్రంలో కావలి నియోజకవర్గం రెండో స్థానంలో ఉందని, అందుకు ఇక్కడి ప్రజలు సీఎం చంద్రబాబు నాయుడికి రుణపడి ఉంటారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 26 మంది లబ్ధిదారులకు రూ.30,49,714 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం ఇప్పటి వరకు 552 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 354 మందికి రూ.3,50,59,206 అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, తటవర్తి వాసు, తిరువీధి ప్రసాద్, శానం హరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ట్రాక్టర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం, పోకూరు, శాఖవరం పంచాయతీల్లో చెత్త తరలించేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.18.60 లక్షలతో కొనుగోలు చేసిన 3 ట్రాక్టర్లను సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, తహసీల్దారు అబ్దుల్‌అమీద్, నాయకులు పరిటాల భాస్కరరావు, కాకుమాను ఆంజనేయులు, కొంకా రమేష్, గుత్తా కొండయ్య, నవ్వులూరి రాజారమేష్, ప్రెగడ శ్రీనివాసులు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, సోమినేని తిరుమలరావు, నల్లమోతు రవీంద్ర, వడ్లమూడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్, ట్యాబ్‌ల బహూకరణ

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్రతిభ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచిన 4వ తరగతి విద్యార్థిని దగ్గు జన్య గ్రాండ్ బహుమతిగా ల్యాప్‌టాప్‌ను గెలుచుకోగా 8వ తరగతి విద్యార్థిని కోటి చెల్సియాహర్షల్ ప్రథమ బహుమతిగా ట్యాబ్‌ను దక్కించుకున్నారు. వీరికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ. సురేష్, వై.అనిల్‌కుమార్, జీ. శ్రీనివాసరావు, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఇస్కపల్లి అభివృద్ధికి సమష్టి కృషి

అల్లూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : ఇస్కపల్లి అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొందరికి ఉపాధిహామీ జాబ్ కార్డులు రద్దవుతున్నాయని, అలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన లబ్ధిదారులు తరచూ పనులకు వెళ్లాలని, లేని పక్షంలో జాబ్‌కార్డులు రద్దు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, సర్పంచు పాటి రంజిత్, స్థానిక నాయకులు కొండూరు పాలుశెట్టి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉప్పుటూరి కాంప్లెక్స్‌లో ఎస్బీఐ సేవలు

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌ను పీఆర్ ఆఫీసు పక్కన హాస్పిటల్ బైపాస్‌లో ఉన్న ఉప్పుటూరి కాంప్లెక్స్‌లోకి మార్పు చేసినట్లు బ్రాంచ్ చీఫ్ మేనేజరు శ్రీనివాస్‌కళ్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఉప్పుటూరి కాంప్లెక్స్ నుంచే ఖాతాదారులకు అన్నిరకాల సేవలు అందించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

కోలాహలంగా పాఠశాల వార్షికోత్సవం

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌతమ్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం రాత్రి వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పాలడుగు శ్రీనివాసులు, కరస్పాండెంట్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతురాజుమిట్ట వద్ద నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్రంవారిపాలెం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్రంవారిపాలెం, పోతరాజుమిట్ట ప్రాంతం, వరపర్లపాలెం, అజ్మల్‌హుస్సేన్ హాస్పిటల్ ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

చుండి గ్రావెల్ రోడ్డుకు ప్రతిపాదనలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాలపురం నుంచి చుండి గ్రామానికి సుమారు 4 కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు కోసం ఉన్నతాధికారులకు పంపించినట్లు పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- అట్టహాసంగా జయంతి వేడుకలు
- కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు దగుమాటి, ఇంటూరి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు, అధికారుల ఘన నివాళి



వలేటివారిపాలెం : బడేవారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు



కావలి : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, టీడీపీ నేతలు



కలిగిరి : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటంతో నిర్వహిస్తున్న ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కందుకూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీడీ అసోసియేషన్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారినవర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో దార్శనికతతో రాజ్యాంగ రచన చేశారని, దానితో నేడు సమాజంలో క్రమక్రమంగా అసమానతలు తొలగుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫీ, అయ్యన్న, నాగభూషణం, ఆర్. బ్రహ్మానందం తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్ర హం వద్ద నివాళులర్పించారు. వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బడేవారిపాలెం, పోకూరు, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, శాఖవరం తదితర గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బడేవారిపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో వేడుకల్లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ అబ్దుల్‌అమీద్, ఎంపీడీవో నరేంద్రదేవ్, నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, దార్ల కోటేశ్వరమ్మ, సాదు శ్రీలత, వలేటి నరసింహం, వలేటి శ్రీధరనాయుడు, కాకుమాను హర్ష, తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : అంబేడ్కర్ మార్గదర్శకులని ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక అంబేడ్కర్ వద్ద విగ్రహ వ్యవస్థాపక కమిటీ కార్యదర్శి జ్యోతి బాబురావు పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని అబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి బాబురావును సత్కరించారు. కార్యక్రమంలో నేతలు ఎల్లంటి వెంకటేశ్వర్లు, మేడికొండ సుకుమార్, వెల్లూరి కిరణ్, మొగిలి కల్లయ్య, పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంధం ప్రసన్న, కుందుర్తి కామయ్య, కనమర్లపూడి నారాయణ పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రి వద్ద ప్రభాకర్‌నాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లేళ్లపల్లి సురేష్‌బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య, సీఐటీయు కార్యదర్శి కృష్ణమోహన్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో యువత రక్తదానం చేసి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

కావలి రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి, అగ్నిమాపక కేంద్రంలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర్‌లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌరవరంలో ఇండ్ల సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు జరుగుమల్లి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : టీడీపీ ఆధ్వర్యంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, పలగాటి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, రాయి నాయుడు, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత సంఘాల ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని సుందరంగా అలంకరింపజేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, పప్పు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన డాక్టర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య, ప్రముఖ కవి, మాజీ సర్పంచు యు నాగేశ్వరరావులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పులి రాఘవులు, నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, అడపా నర్సయ్య, ఎలిపాలి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి కాలనీ యువకులు పూలమాల వేసి నివాళి అర్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సీతామహాలక్ష్మి, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పెదపవని, ముత్యాలపాడు, అన్నెబోయినపల్లి తదితర గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.



కందుకూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు



అల్లూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీద గిరిధర్, టీడీపీ నాయకులు

కొండాపురం : సాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లా చినమాలకొండయ్య, వింతా గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి రవీంద్రరెడ్డి, సోమినేని రవీంద్రబాబు, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు/ చిట్రగుంట: బోగోలు బజారు కూడల్లోని అంబేడ్కర్ విగ్రహానికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు తమ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో హ్యూమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు డి.సునీల్, దళిత నేతలు ఎస్.మల్లి, బీ.రవిచంద్ర, ఎంఆర్పీఎస్ నేత పీ.శీనయ్య, టీడీపీ నేత ఎం.నాగేశ్వరరరావు, బీజేపీ నేత వీరాలశ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎల్.సురేష్‌బాబుచే కేక్‌కట్ చేయించి భోజపంపిణీ చేశారు.

కలిగిరి : మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలో ఎస్సీ కాలనీ నుంచి అంబేడ్కర్ భారీ చిత్రపటంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం, గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో ఎంపీడీవో ప్రత్యూష, కార్యదర్శి రవిచంద్ర, సర్పంచు రాగి దివ్య, ఉపసర్పంచు పాలూరు కొండారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలోని 12 పంచాయతీల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌లోని యువత, మహిళలు భారీగా బాణాసంచా, డీజే, డప్పు వాయిద్యాలతో అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించి ఉత్సవంలా జరుపు కున్నారు.

ఆక్రమిత స్థలంలో షాపులకు

పెంచిన పన్ను తగ్గింపు

- ఎమ్మెల్యే ఆదేశాలతో దిగివచ్చిన మున్సిపల్ అధికారులు

కావలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకునే వారికి మున్సిపల్ అధికారులు పెంచిన పన్నులను సగానికి సగం తగ్గించారు. పర్మినెంట్ దుకాణాల ముందు స్థలాల్లో వ్యాపారం చేసుకునేవారికి తాత్కాలికంగా పన్ను నిలిపి వేశారు. మున్సిపల్ ఆదాయం పెంపొందించుకునే క్రమంలో ఆక్రమిత స్థలంలో షాపులకు ఆక్రమణల స్థలాల విస్తీర్ణం ఎక్కువ చూపించి గతం కన్నా రెట్టింపు పన్ను వేస్తూ నోటీస్‌లు ఇచ్చారు. దీంతో బాధితులు లబోదిబో మంటూ ఆ నోటీస్‌లు పట్టుకుని మున్సిపల్ కార్యాలయానికి, రాజకీయ నాయకుల వద్దకు పరుగులు తీశారు. తాము రోజంతా రోడ్ల మీద వ్యాపారం చేసుకుంటే వచ్చే రూపాయి మీకు కట్టితే తాము ఎలా బతకాలని గగ్గోలు పెట్టారు. ఇదిలా ఉంటే దుకాణాల ముందు కొంత ముందుకు వచ్చిన ఆక్రమణదారులకు కూడా పన్నులు వేసి వసూలుకు దిగటంతో వారు కూడా వేలకు వేలు పెట్టి దుకాణాలు అద్దెకు తీసుకుంటే తమ దుకాణాల ముందు స్థలానికి కూడా ఆక్రమణల పేరుతో పన్నులు వేయడంపై వారు కూడా అధికారులు, రాజకీయనాయకుల మీద ఒత్తిడి పెంచారు. దీంతో ఈ విషయం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందిస్తూ పెంచిన ఆక్రమణల పన్నులను తగ్గించి గతంలో ఎలా పన్నులు వేశారో అలాగే కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు దిగి వచ్చి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు పెంచిన పన్నులను తగ్గించి పాత పన్నులనే వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే దుకాణాల ముందు ఆక్రమణలకు తాత్కాలికంగా పన్నుల వసూళ్లను పూర్తిగా నిలిపి వేయాలని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు.



ఆర్వోబీ వంతెన కింద ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన మెకానిక్ షాపులు

● ఆక్రమిత స్థలాలకు లీజు హక్కులు

కావలి పట్టణంలో కొందరు వైట్ కాలర్లు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని వాటిని మరొకరికి లీజ్‌కు ఇచ్చి సొంత స్థలాలుగా నెలవారి అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. చోటా నాయకులకు ఇది పెద్ద వ్యాపారంగా మారింది. అయితే రోడ్ల మార్జిన్‌లలో, ప్రభుత్వ స్థలాలలో వ్యాపారాలు చేసుకునే వారికి గత్యంతరం లేక లీజ్‌కు తీసుకోక తప్పలేదు. దీంతో మున్సిపల్ అధికారులు ఆక్రమణలలో వ్యాపారాలు చేసుకునేవారిని గుర్తించి మధ్య లీజ్‌దారులు లేకుండా వ్యాపారాలు చేసుకునే వారికే ఆ స్థలాపై హక్కులు కల్పించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ స్థలాలలో ఆక్రమణలలో ఎవరు ఉన్నారో వారి పేరు మీదనే ఆక్రమణ పన్నులు వేసి రసీదు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అద్దెకు ఇచ్చేవారికి ఆ స్థలాలపై హక్కులు లేకుండా ఆక్రమణలో ఉన్న వారికే హక్కులు కల్పించాలని చెప్పారు. దీంతో ప్రభుత్వ స్థలాలను లీజ్‌కు తీసుకుని వ్యాపారం చేసుకునే వారికి కూడా దళారుల బెడద నుంచి కొంత ఊరట లభించింది.

కందుకూరులో భారీ చోరీ

కందుకూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీకాలనీలో ఓ ఇంట్లో భారీగా నగలు, నగదు చోరీ అయ్యాయి. మోటుమర్రి సురేంద్రకుమార్ కుటుంబసభ్యులతో కలిసి దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత దొంగలు ఇంటి తలుపు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి నగలు, నగదు అపహరించారు. సోమవారం ఉదయాన్నే ఇంటికి వచ్చిన సురేంద్రకుమార్ కుటుంబసభ్యులు దొంగతనం జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. 15 సవర్ల బంగారం, 6 కిలోల వెండి, రూ.3 లక్షల నగదు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేటెడ్ కమ్యూనిటీగా నిర్మించి ఉన్న వాసవీకాలనీకి కట్టుదిట్టమైన భద్రతతోపాటు వాచ్‌మన్ కూడా ఉంటున్నందున ఆ కాలనీలోనే చోరీకి దొంగలు తెగబడటం పట్ల భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.



ఇంట్లో బీరువాల్లోని చీరలు, ఇతర వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

మహనీయుల విగ్రహాలను

త్వరలో ప్రారంభిస్తాం : మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం వెలుపోడు సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుల విగ్రహాల పనులను పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. సోమవారం తన సోదరుడు, ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడుతో కలసి విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాలకు గుర్తుండేలా మహనీయుల విగ్రహాలను మాలేపాటి కుటుంబ సభ్యులం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకు ముందు మాలేపాటి స్వగృహంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన నిరుపేదలకు సిమెంటు రేకులు, సిమెంటు అందచేశారు. అందరికీ భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జి కే.కృష్ణ, రమణమ్మ, పరంధామయ్య, పెంచలయ్య, గోపాల్, నాగేశ్వరరావు, మనోహర్, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలను పరిశీలిస్తున్న మాలేపాటి సోదరులు

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కందుకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద బజారు కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు, మహిళలు కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరుకాగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మురారిశెట్టి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం



కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కావలి అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్రిమాపక వారోత్సవాల ప్రారంభించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.రమణయ్య పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలు, గోడపత్రికలు ఆవిష్కరించారు. విధినిర్వహణ లో అసువులు బాసిన సిబ్బందికి నివాళులర్పించారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు తక్షణం 101, 112, 08626-243101, 9963734286కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

కలిగిరి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోదండరామస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారం రథోత్సవంతో ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో జై శ్రీరామ్ నినాదాలతో స్వామివారికి రథంలో గ్రామోత్సవం నిర్వహించగా గ్రామస్తులు కాయ, కర్పూరంతో స్వామివారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కమ్మవారిపాలెంలో కోదండరాముడి రథోత్సవం

చిత్రజ్యోతి
SINCE 1965

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.


సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫీమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..




రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

ఎందుకలా!?

ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలలు అంటే ఉత్తీర్ణతపై నమ్మకంతోపాటు భరోసా ఉండేది. ఇక్కడ చదివిస్తే విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగుతారన్న నమ్మకం తల్లిదండ్రుల్లో ఉండేది. అయితే, రానురాను పరిస్థితుల్లో మార్పు వస్తోంది. శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలే ఇందుకు నిదర్శనం. జిల్లాలో ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్, ఎయిడెడ్, మోడల్‌స్కూల్స్, జేజీబీవీలలో ఫలితాలు ఆశించినస్థాయిలే లేవు. ఈ ప్రభావం అడ్మిషన్లపై పడనుందని విద్యా ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. జిల్లాలో ఇంటర్ కళాశాలల పనితీరు మెరుగు పడకపోవడం, పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే అధిక శాతం మంది తమకు ఆర్థికంగా ఇబ్బందులైనా సరే ప్రైవేటు బాట పడుతున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



● ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల వెనుకడుగు

● అడ్మిషన్‌లపై పడనున్న ప్రభావం

● పరిస్థితులు చక్కదిద్దకుంటే భవిష్యత్తు ప్రమాదమే!

పదో తరగతిలో సాధించిన ఫలితాలు ఇంటర్‌కు వచ్చేసరికి మారిపోతున్నాయి. ఇంటర్‌లో ఉన్న ఫలితాలు వారు ఇంజనీరింగ్, ఇతర కోర్సులకు వెళ్లేసరికి పూర్తిగా వ్యత్యాసం ఉంటున్నాయి. దీనికి కారణం అధికంగా మాస్ కాపీయింగ్ అనేదే బలంగా వినిపిస్తోంది. విద్యార్థులు కూడా చదవకపోయినా తాము పాస్ అవుతాములే అనే ఆలోచనలో ఉన్నారు. ఉపాధ్యాయులపై టార్గెట్లు పెట్టడం, ఉత్తీర్ణత శాతం పెంచాలి, ప్రతి విద్యార్థి పాస్ అవ్వాలి అనే నినాదంతో ఉన్నత చదువులకు వెళ్లే సరికి విద్యార్థుల్లో నైపుణ్యాలు లేక వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి వస్తోంది. ఇటీవల నిర్వహించిన సర్వేలు కూడా ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు లేవని తేల్చి చెప్పింది. తల్లిదండ్రుల ఆలోచన విధానాల్లో మార్పులు రాకపోతే రాబోయే రోజుల్లో ఎక్కడ విద్యార్థులు అక్కడే నిలిచిపోయి నైపుణ్యాలు లేక విద్యకు, ఉద్యోగాలకు దూరం కావాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

పర్యవేక్షణ లేకనే..

ప్రభుత్వ కళాశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఫలితాలు తగ్గాయని విద్యా ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడం, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లలో బాధ్యత లేకపోవడంతో ఈ ఫలితాలు వచ్చాయంటున్నారు. లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న అధ్యాపకులు విధుల నిర్వహణ సక్రమంగా చేసినా, విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించినా ఈ పరిస్థితులు ఉండేవి కావని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా ప్రమాణాలు పెంచాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

● జూనియర్ ఇంటర్‌లో..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 181 ఉన్నాయి. వీటిలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలు 110 ఉండగా, ప్రభుత్వ కళాశాలలు 24, మోడల్ 11, ఎయిడెడ్ 2, సోషల్ వెల్ఫేర్ 6, హైస్కూల్ ప్లస్ 16, కేజీబీవీలు 12 కళాశాలలు ఉన్నాయి. వీటిలో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 24 ప్రభుత్వ కళాశాలల్లో 2,283 మంది పరీక్షలకు హాజరవగా 1,213 మంది ఉత్తీర్ణత (53.13 శాతం) సాధించారు. అలాగే 11 మోడల్ స్కూల్స్‌లో 840 మందికి 411 మంది (48.19శాతం), 2 ఎయిడెడ్‌లలో 165 మంది 42 మంది (25.45 శాతం), 6 ఏపీ సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో 472 మందికి 440 మంది (93.22 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా 16 హైస్కూల్ ప్లస్‌లో 304 మందికి 144 మంది (47.36శాతం), 12 కేజీబీవీల్లో 294 మందికి 194 మంది (65.98 శాతం) ఫలితాలు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పరిధిలోని 71 కళాశాలల్లో 4,358 మంది పరీక్షలకు హాజరవగా 2,444 మంది ఉత్తీర్ణతతో 56.08 శాతం ఫలితాలు సాధించారు. ప్రైవేట్‌లో మాత్రం 110 కళాశాలల్లో 21,914 మందికి 16,838 మంది ఉత్తీర్ణతతో 76.83 శాతం ఫలితాలు సాధించారు.

సీనియర్ విద్యార్థుల తప్పటడుగు

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 24 ప్రభుత్వ కళాశాలల్లో 1,796 మందికి 1353 మంది (75.33 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 11 మోడల్ స్కూల్స్‌లో 606 మందికి 473 మంది (78.05శాతం), 2 ఎయిడెడ్ కళాశాలల్లో 166 మందికి 96 మంది (57.83శాతం), 6 ఏపీ సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో 427 మందికి 424 మంది (99.29శాతం) ఫలితాలు వచ్చాయి. అలాగే 16 హైస్కూల్ ప్లస్‌లో 184 మందికి 150 మంది (81.52శాతం), 12 కేజీబీవీల్లో 168 మందికి 144 మంది (85.71శాతం) ఫలితాలు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పరిధిలోని 71 కళాశాలల్లో 3,347 మందికి 2,640 మంది ఉత్తీర్ణతతో 78.87శాతం ఫలితాలు సాధించారు. ఇక ప్రైవేట్ 110 కళాశాలల్లో 19,849 మందికి 17,209 మంది ఉత్తీర్ణతతో 88.82శాతం ఫలితాలు సాధించారు. అయితే ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రెండింటిలోనూ ఏపీ సోషల్ వెల్ఫేర్ కళాశాలలు మాత్రం కొంత మెరుగ్గా ఉన్నా మిగిలిన కళాశాలల స్థితిగతులపై సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని విద్యానిపుణులు చెపుతున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

● రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, చదువు ద్వారా సమాజహితం కోసం తమ వంతు కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని 62 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో రూ.9.32 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. రెండు నెలల్లోనే ఈ పనులన్నీ పూర్తవుతాయని పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వానికి రూ.5.5 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్ పంపించామని చెప్పారు. ఈ సంవత్సరంలోనే ఈ భవనాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గతంలో సీజేఎఫ్ఎస్ భూములను రద్దు చేసినప్పుడు 70 శాతం లబ్ధిదారులకు మాత్రమే పట్టాలు అందించామని అన్నారు. అసైన్‌మెంట్ రివ్యూ కమిటీల ఏర్పాటుకు ఆమోదం రాగానే మిగిలిన 30 శాతం మందికి కూడా డీకేటీ పట్టాలిస్తామని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చట్టాలపై అవగాహన లేక చాలామంది గిరిజనులు మోసపోతున్నారని, వారికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ కుసుమకుమారి, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఖాసిం బ్యాగులు, పెన్నులను విద్యార్థులకు అందించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై భారత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలైన విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఎస్‌డబ్ల్యూ హాజరత్తయ్య, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జాయింట్ కలెక్టర్ కార్తీక్ తదితరులు

కాలం చెల్లినవీ అమ్మేస్తున్నారు..!

వేసవి కాలంలో భానుడి తాపానికి దాహార్తి తీర్చుకోవడంతో పాటు తక్షణ ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానీయాలు సేవిస్తుంటారు. అయితే అవి ఎప్పుడు తయారయ్యాయి.. వాటి గడువు ఉందా లేదా కూడా ఎవరూ పట్టించుకోరు.. ముందు ఉపశమనం పొందడమే ముఖ్యం అన్నట్టు తాగేస్తారు. ఈ క్రమంలో ప్రజారోగ్యం పట్టని కొంతమంది ఏజెన్సీ నిర్వాహకులు కాలం చెల్లిన శీతల పానీయాలు దుకాణాలకు పంపిణీ చేస్తున్నారు. దుకాణదారులకు వీటిని ప్రజలకు అమ్మేస్తున్నారు. కొడవలూరు మండలం పద్మనాభుని సత్రంలో ఉండే ఓ ఏజెన్సీ నుంచి అల్లూరులోని పలు దుకాణాలకు సోమవారం శీతల పానీయాలు సరఫరా చేశారు. వాటిల్లో కాలం చెల్లిన శీతల పానీయాలను ఉన్నాయి. కాలం చెల్లిన వాటిని విక్రయించడాన్ని గుర్తించిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధిక వ్యాపారం జరిగే దుకాణాలకు కాలం చెల్లినవి ఒకటి, రెండు కేసులు, తక్కువ వ్యాపారం జరిగే దుకాణాలకు కేసుల మధ్యలో కొన్ని కాలం చెల్లినవి పెట్టి సరఫరా చేస్తున్నారు. ఓ దుకాణంలో 2025 ఫిబ్రవరి 11వ తేదీ నాటికి కాలం చెల్లినవి దర్శనమిచ్చాయి. దీనిపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమని ఏజెన్సీ వారిని ప్రశ్నిస్తే తిప్పి పంపమని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- అల్లూరు,(ఆంధ్రజ్యోతి)



ఫిబ్రవరి 11కి గడువు తీరిన శీతల పానీయం

అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం

● వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ ● ప్రజాచైతన్యంతోనే ప్రమాదాల నివారణ : డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రజాచైతన్యంతోనే వాటి నివారణ సాధ్యమవుతుందని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను సీనియర్ లీడింగ్ ఫైర్‌మెన్‌లు మస్తానయ్య, హరిబాబు, వెంకటేశ్వర్లు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నామని, విధి నిర్వహణలో ఏ శాఖ నిర్లక్ష్యంగా ఉన్న జరిగే నష్టం కంటే, తాము నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీ నష్టం జరుగుతుందన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈనెల20 వరకు అన్నివర్గాల ప్రజలను చైతన్యం పరిచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టరేట్‌లో డీఆర్‌వో జే ఉదయ్‌భాస్కర్‌రావు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో, అగ్నిమాపక శాఖ అధికారులు